J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 14 10.9.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • ప్రభుత్వానికి కోర్టుల్లో చుక్కెదురు



# దెబ్బ మీద దెబ్బ

**ప్రజల మనిషి అనిపించుకుని, జననేతగా పిలిపించుకుని, తనతో పాటు మరో 150 మంది శాసన సభ్యులను, 23 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించుకుని, తనను తాను నిరూపించుకున్న ఈ తరం యువ నాయకుడు ఆంధ్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.**

ఉమ్మడి రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తన తండ్రి వారసత్వంగా తాను ముఖ్యమంత్రిని కావాలని పట్టు బట్టి మరీ అధికార పగ్గాలు చేపట్టారు జగన్. అందుకోసం అయన దీక్షలు చేశారు, ధర్నాలు చేశారు, తిరుగుబాటు కూడా చేశారు. అంతేకాదు ఓదార్పు యాత్ర, ప్రజా సంకల్ప యాత్ర అంటూ దశాబ్దకాలం భార్యా బిడ్డలకి దూరంగా రోడ్లపైనే తిరిగారు. ఫలితంగా అనూహ్య విజయం తన సొంతం చేసుకున్నారు. జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి రెండు సంవత్సరాల నాలుగు నెలలు పూర్తయ్యింది. మరో రెండునెలలలో తొలి ఐదేళ్లలో సగం

10లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
వినాయకచవితి
శుభాకాంక్షలు
సం/-

## నిరాశ, నిరుత్సాహం, నిర్లిప్తతతో... నిర్వీర్యమైపోయిన నిర్మాణ రంగం

# కంటతడి పెడుతున్న కాంట్రాక్టర్లు

**గతంలో చేసిన పనులకు డబ్బులు రావు.. కొత్తగా చేయవలసిన వాటికి కాసులు లేవు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నగదు బదిలీ పథకాల కోసం లక్షల కోట్లు 'బటన్' నొక్కడం ద్వారా నేరుగా ప్రజల అకౌంట్లలోకి వెళ్ళిపోతుండడంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన కుంటినడక నడుస్తోంది.**

గత 50 సంవత్సరాల తెలుగు రాష్ట్రాల చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే... రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో గతంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించక పోగా, ఒక్క పని కోసం కూడా ప్రభుత్వం టెండర్ పిలవక పోవడం కొత్త వండర్‌గా ఆంధ్రలోని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఇప్పుడు కొత్తగా రాష్ట్ర రహదారులకు ప్రభుత్వం టెండర్లు పిలిచినా ఆ పనులు చేసే ధైర్యం తమకు లేదని తెగేసి చెప్తున్నారు.

దేశంలో ఎక్కడైనా కాంట్రాక్టర్ల వ్యవస్థ ఒకేలా ఉంటుంది. ప్రభుత్వం ఒక పదివేల కోట్లకు టెండర్లు పిలిచి సకాలంలో 5వేల కోట్లు బిల్లులు చెల్లించినా... మిగిలిన 5వేల కోట్లు వచ్చేలోగా మళ్ళీ మరో పదివేల కోట్ల పనులు చేయడానికి కాంట్రాక్టర్లు సిద్ధపడిపోతారు. ఇదొక సర్కిల్‌లా జరుగుతుంది. ప్రభుత్వ పనులు వాళ్ళు చేస్తూ ఉంటారు, ప్రభుత్వం వారికి విడతలవారీగా బిల్లులు చెల్లిస్తూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆంధ్రలో పరిస్థితి అలా లేదన్నది వారి ఆవేదన. కాంట్రాక్టర్ల వ్యవస్థే అవస్థల్లో ఉందన్నది వారి ఆక్రందన.


ఉదాహరణకు రోడ్లు భవనాల శాఖను తీసుకుంటే, 2019 మే నెలలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ ఒక్క టెండర్ కూడా పిలవలేదు. జనవరి 2021 నుండి నిన్న మొన్నటి వరకు కొత్త పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచే ప్రయత్నం చేసినా ఒక్క కాంట్రాక్టర్ కూడా ధైర్యంగా ముందుకి వచ్చి టెండర్ వెయ్యలేదు. వరసగా మూడు సార్లు ప్రభుత్వం ప్రయత్నం చేసినా ప్రయోజనం శూన్యం.

10లో



# బడుల్లోకి చొరబడుతున్న కరోనా

⇨ 23 మందికి కోవిడ్ పాజిటివ్
⇨ చిట్టేడు, కోట విద్యాలయాల్లో కలకలం




పాఠశాలలు తిరిగి తెరవడంతో కరోనా బడుల్లోకి కూడా చొరబడుతోంది. కోట మండలంలోని చిట్టేడులోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో 19 మందికి కోవిడ్ పాజిటివ్ రావడంతో అధికారులు వారిని వెంటనే గూడూరు కోవిడ్ సెంటర్‌కు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. మిగిలిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా కరోనా పరీక్షలు చేయించి వారికి కోవిడ్ రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించారు. ఐటిడిఓ పి.ఓ కనకదుర్గ, తహశీల్దారు పద్మావతి, ఎంపిడిఓ భవాని, ఎంఇఓ వెంకటసునీల్ తదితరులంతా వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. గురుకుల భవనాలను శానిటైజ్ చేయించారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, ఆర్డీఓ మురళీకృష్ణ తదితర అధికారులు గూడూరు ఏరియా ఆసుపత్రికి వెళ్ళి అక్కడ చేరిన గురుకుల విద్యార్థులను పరామర్శించారు.

### మనుబోలులో :

మనుబోలు మండలంలోని చెరుకుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయునికి, గొట్లపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో మరో టీచరుతో పాటు ఇద్దరు విద్యార్థులకు కూడా కరోనా పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. విద్యార్థులిద్దరూ చిన్నపిల్లలు. ఒకరు 4వ తరగతి, మరొకరు 6వ తరగతి చదువుతున్నారు. చిన్నపిల్లలకు కరోనా వస్తుండడంతో పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

### వెంకటగిరిలో

వెంకటగిరి గురుకుల పాఠశాలలో కూడా తాజాగా ఈనెల 6న కోవిడ్ పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. ఈ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. మొత్తం 80మంది విద్యార్థులకు కోవిడ్ పరీక్షలు చేయించి, పాజిటివ్ వచ్చిన ఆరుగురిని చికిత్స కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ముత్తుకూరులో లాక్‌డౌన్


ముత్తుకూరు మండలంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నందువల్ల సెప్టెంబరు 5 నుంచి లాక్‌డౌన్ విధించారు. మండలంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే దుకాణాలకు అనుమతి ఉంటుందని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల దాకా లాక్‌డౌన్ అమలులో ఉంటుందని తహశీల్దారు సోమ్లానాయక్ సూచించారు. ప్రజలంతా కోవిడ్ నిబంధనలు పాటించాలని, గుంపులుగా తిరగవద్దని, సామాజిక దూరం పాటించాలని ఆయన పేర్కొన్నారు. కరోనా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కంటిచూపు పట్ల జాగ్రత్త వహించాలి



విద్యార్థులు కంటిచూపును ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, కళ్ళకు ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మంజులమ్మ సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఇటీవల ఆమె కోవూరు మండలంలోని ఇనమడుగు జడ్పీ స్కూల్‌లో, ఈనెల 6వతేదీ నెల్లూరు వేదాయపాళెంలోని సుస్మిత నర్సింగ్ స్కూల్‌లో కంటిచూపు పట్ల అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నేత్రదాన ఆవశ్యకతను కూడా వారికి వివరించారు. నేటి విద్యార్థులు రేపటి నేత్రదాతలు కావాలని ఆమె ఆకాంక్షించారు. మరణించిన తర్వాత నేత్రదానం చేసినందువల్ల మరో ఇద్దరు జీవితాలకు కంటిచూపు ప్రసాదించవచ్చని, నేత్రదానం సమాజసేవకు ఉపయోగపడే ఒక సంప్రదాయంగా అందరూ పాటించాలని కోరారు. రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, హెడ్మాస్టర్ రాధారాణి, స్థానిక నాయకుడు పొన్నవోలు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


9వ వర్ధంతి



మా తల్లి గారైన
శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
దైవ సన్నిధికి చేరి 9సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.
మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

స్వర్గీయ శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
W/o లేట్ S.V. రత్నం గారు
కవి & ఎడిటర్, గూడూరు.

కుమారులు - కోడళ్ళు
శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి
శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ
- శ్రీకంటి మాలతి
కుమార్తెలు - అల్లుళ్ళు
యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు
మద్దాళి వసుప్రద - వెంకట కృష్ణారావు
కారుమంచి ఇందిర -

మనుమరాలు - మనుమడు
వెంకట మంజుప్రీతి - కామేశ్వర్
ముని మనుమడు : ఆర్యన్

కారుమంచి బాలసుబ్రహ్మణ్యం & వారి కుటుంబసభ్యులు
శ్రీకంటి సంధ్య & వారి కుటుంబసభ్యులు
శ్రీకంటి కార్తీక్ & వారి కుటుంబసభ్యులు
చిట్టమూరు మహేశ్వరి & వారి కుటుంబసభ్యులు
శ్రీకంటి మనోజ్ & వారి కుటుంబసభ్యులు
యరగుడిపాటి రంగనాథ్ & వారి కుటుంబసభ్యులు
యరగుడిపాటి అమరనాథ్ & వారి కుటుంబసభ్యులు
మద్దాళి హరిత & వారి కుటుంబసభ్యులు
మద్దాళి దీప్తి & వారి కుటుంబసభ్యులు


## చాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు



ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారికి శ్రావణమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈనెల 3న ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధరకాలైన పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి కన్నులపండువగా పూలంగిసేవ నిర్వహించారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు

దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల శాఖ వారి సహకారంతో ఈనెల 3న సీతారామపురంలో అయిదుగురు దివ్యాంగులకు ఎస్ఐ కిషోర్‌బాబు చేతుల మీదుగా ట్రైసైకిళ్ళు పంపిణీ చేశారు. ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్, రంగనాయకులతో పాటు వైకాపా నాయకులు రామచంద్రయ్య, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమణయ్య, ఓవిఎస్ రాజు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

# బస్సులను సురక్షితంగా నడపాలి

**- ఆర్టీసి డెప్యూటి సిటిఎం**



ఆర్టీసి డ్రైవర్లు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ బస్సులు నడపడంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసి డెప్యూటి సిటిఎం చిరంజీవి చెప్పారు. రోడ్డు భద్రతా పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 3న ఉదయగిరి ఆర్టీసి డిపోలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కువగా అలక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో, మెళకువతో బస్సులు నడపడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. తొలుత ఆయన ఉదయగిరి ఆర్టీసి డిపోను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బస్సులను జాగ్రత్తగా నడపాలన్నారు. డిపో మేనేజర్ ప్రతాప్‌కుమార్, సహాయ ట్రాఫిక్ మేనేజర్ రాము, ట్రాఫిక్ సిఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లు తొలగించడం.. దారుణం

**- టిడిపి ఆందోళన**



రాష్ట్ర ప్రభుత్వం గత మూడు నెలలుగా రకరకాల కారణాలతో పింఛన్లు తొలగింపు చేపట్టిందని, దీనివల్ల పేదలకు ఆసరాగా ఉండాల్సిన ఈ పథకం నీరుగారిపోతోందని తెలుగుదేశం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 3న నెల్లూరులో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధికారప్రతినిధి సంపత్‌యాదవ్ తదితరులంతా కలిసి నెల్లూరు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్ళి పింఛన్లు తొలగించవద్దంటూ రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. పింఛను పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం రెండేళ్ళుగా కాలయాపన చేస్తూనే ఉందని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి ఇకనైనా పేదల కష్టాలు గుర్తించి పింఛన్లు తొలగించడం ఆపాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జలదంకి సుధాకర్, సాబిర్‌ఖాన్, కనపర్తి గంగాధర్, రంగారావు, మాతంగి కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల దుస్థితిపై జనసేన నిరసనలు

జిల్లాలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వాటిని బాగుచేయకుండా కాలయాపన చేయడం విచారకరమని జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు ఇటీవల నిరసనలు వ్యక్తం చేశారు. జనసేనాని పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు రోడ్ల దుస్థితిపై వారు ఈ ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు. పొదలకూరు-రాపూరు రోడ్డు దారుణంగా ఉందని, అంతా గుంటలుమిట్టలుగా ఉండి వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉందని పొదలకూరులో ఆందోళన నిర్వహించిన జనసేన నాయకుడు సురేష్‌బాబు చెప్పారు. అధికారులు రోడ్లు బాగుచేయించకుండా ప్రమాదాలు ఎలా నివారించగలరని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోకేష్, ప్రదీప్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో చోరీల పట్ల జాగ్రత్త

ఆత్మకూరు పరిసరాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల ఆలయాలు, చిన్న చిన్న గుడుల్లో దుండగులు జొరబడి చోరీలు చేస్తూ హుండీలు అపహరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నేరాల కట్టడికి గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఆలయాల కమిటీ నిర్వాహకులు సహకరించాలని ఆత్మకూరు సిఐ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఇటీవల ఆయన ఆలయ కమిటీలు, సర్పంచ్‌లతో సమావేశమై ఆలయాల నిర్వహణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# లింగనిర్ధారణ నేరం

గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఈ విషయమై ప్రతి ఆరోగ్యకార్యకర్త అవగాహనతో ఉండి ప్రజలకు కూడా తెలియపరచాలని వైద్య ఆరోగ్యశాఖ డెమో అధికారి శ్రీనివాసులు చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులకు లింగనిర్ధారణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రుల్లో కానీ, స్కానింగ్ సెంటర్లలో కానీ ఎక్కడైనా లింగనిర్ధారణ చేస్తే కఠినచర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.



# శ్రీసిటీలో అధునాతన స్కూల్ భవనం

## ● 29 లక్షలతో తరగతి గదులు, స్టూడెంట్ డెస్కులు

శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్‌ప్లేట్ ప్రాసెసింగ్(ఐమాప్) పరిశ్రమ వితరణతో ఇరుగుళం జడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన అధునాతన బహుళ ప్రయోజక స్కూల్ భవనాన్ని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇవాన్ ఈ నెల 8న ప్రారంభించారు. 29 లక్షల రూపాయల వ్యయంతో 3 తరగతి గదుల భవన నిర్మాణంతో పాటు 48 స్టూడెంట్ డెస్కులు, టీచర్స్ డెస్కులు, కుర్చీలు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశారు. కంబైన్డ్ క్లాసులు, సమావేశాలు, పరీక్షల నిర్వహణకు వీలుగా 3 తరగతి గదులను ఒకే హాల్‌గా వినియోగించుకునేలా అత్యద్భుతమైన రీతిలో భవన నిర్మాణం చేశారు. ప్రారంభం అనంతరం నూతన భవనాన్ని ఐమాప్ డైరెక్టర్ సుజుకి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర కుమార్ సమక్షంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి అప్పగించారు.

ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇవామి మాట్లాడుతూ శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ దిశగా తమను ప్రోత్సహిస్తూ తగు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐమాప్ చొరవను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు. శ్రీసిటీలోని పరిశ్రమల సహకారం భాగస్వామ్యంతో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి మాత్రమే కాకుండా పిల్లల నమోదు, ఉత్తీర్ణత శాతం పెంపు, వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంపై తాము ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన భవనం ఏర్పాటుతో పాఠశాల ఆవరణ సరికొత్త శోభను సంతరించుకోవడంపై ఇరుగుళం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. నూతన భవన ఏర్పాటుపై ఐమాప్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధానోపాధ్యాయులు మధు, ఈ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల మౌళిక వసతుల అభివృద్ధికి ఎంతో చొరవ చూపుతున్న శ్రీసిటీ ఫౌండేషన్ పనితీరును ప్రశంసించారు.

# సోమశిల డ్యాం మరమ్మతులకు గ్రీన్‌సిగ్నల్

## 117 కోట్లతో త్వరలో పనులు - మంత్రి గౌతంరెడ్డి



కొద్దినెలల క్రితం వరదనీటి ప్రవాహంతో దెబ్బతిన్న సోమశిల జలాశయానికి నేటికీ మరమ్మతులు చేయకపోవడం, ఇప్పుడు గత కొద్దిరోజులుగా పైతట్టు ప్రాంతాల నుంచి మళ్ళీ వరద నీటి ప్రవాహం వస్తుండడంతో ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా గేట్లు ఎత్తివేసి పద్ధతిప్రకారం నీటిని దిగువకు పంపాలని అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి శుభవార్త చెప్పారు. నిండా నీళ్ళతో ఉన్న ఈ డ్యాంలోకి వరదనీళ్ళ ప్రవాహం కూడా గతంలో భారీగా వచ్చినప్పుడు ప్రజలు, రైతులు ఈ డ్యాంకు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని బెంబేలెత్తిపోయారు. అప్పట్లో డ్యాంలోని ఏప్రాన్ కట్టడం కూడా దెబ్బతినడంతో డ్యాంకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. దీంతో, సోమశిల జలాశయంలో దెబ్బతిన్న ఏప్రాన్‌ను తిరిగి బాగుచేయడానికి ప్రభుత్వం సంకల్పించిందని, నిపుణుల కమిటీ సూచనల మేరకు 117 కోట్లతో పనులు ప్రారంభం కానున్నాయని మంత్రి మేకపాటి చెప్పడం స్థానిక ప్రజలకు ఊరట కలిగించింది. ఇప్పుడు వస్తున్న వరదనీటి ఉధృతి ఉపశమించాక మరమ్మతు పనులు చేపడతారని మంత్రి చెప్పడంతో అందరూ సంతోషించారు. ఈనెల 8న ఆయన వెంకటగిరి, సర్వేపల్లి ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి సోమశిలకు వచ్చారు. డ్యాం దగ్గర పూజలు చేసిన తర్వాత క్రస్ట్‌గేటును ఎత్తి 5వేల క్యూసెక్కుల నీళ్ళను దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మేకపాటి మాట్లాడుతూ గత ఏడాది వర్షాల సమయంలో సోమశిల డ్యాం నుంచి 4లక్షల క్యూసెక్కుల దాకా నీళ్ళని బయటకు విడుదల చేసినప్పుడు జలాశయంలోని ఏప్రాన్ కట్టడం దెబ్బతినిందని, అయితే దానివల్ల డ్యాంకు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుజాగ్రత్తగా ఏప్రాన్ మరమ్మతలను చేయడంతో పాటు డిజైన్ మార్చి కొంత వెడల్పు పెంచడం కూడా జరుగుతుందన్నారు. సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటిసామర్థ్యం దాకా నీళ్ళని నిల్వ ఉంచి డ్యాం పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీళ్లందించడం జరుగుతుందన్నారు. గత మూడేళ్ళుగా వర్షాలు బాగా కురుస్తుండడంతో డ్యాంలో నీళ్ళు పుష్కలంగా ఉన్నాయని, వ్యవసాయానికి అవసరమైన సాగునీళ్ళందించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణి, సోమశిల సిఇ హరినాధరెడ్డి, ఎస్ఇ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి, డిఓ మనోహరతో పాటు ఇఇ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఎజివై అమలులో దేశంలో..

# నెల్లూరుజిల్లాకు ద్వితీయస్థానం



ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన పథకం అమలులో ఉత్తమ ప్రగతి సాధించిన జిల్లాలకు కేంద్రం పిఎంఏజివై-2020 అవార్డులను ప్రకటించింది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సామాజిక అంతరాలు తొలగించి, సమగ్ర అభివృద్ధితో గ్రామాల పురోభివృద్ధికి బాటలు వేయడం ఈ పథకం లక్ష్యం. 2009-10లో కేంద్రప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం అమలులో ఉత్తమంగా ఉన్న జిల్లాలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తుంది. ఈ అవార్డు కింద 10 లక్షల రూపాయల పారితోషికాన్ని కూడా ఆయా జిల్లాలకు అందజేస్తుంది. తాజాగా దేశస్థాయిలో ఈ అవార్డులకు ఉత్తమంగా ఉన్న 3 జిల్లాలను ఎంపిక చేయగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు అందులో రెండవస్థానం లభించడం విశేషం. మొదటిస్థానంలో అస్సాంకు చెందిన క్యాచర్ జిల్లా ఉంది. 3వ స్థానం కూడా మన రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాకు లభించింది. ఈ పథకం అమలులో నెల్లూరు జిల్లా ద్వితీయస్థానం సాధించడంపట్ల అధికారవర్గాల కృషిని, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కృషిని అందరూ అభినందిస్తున్నారు. దేశస్థాయిలో అవార్డుకు ఎంపికైనందుకు జిల్లా కలెక్టర్‌కు, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారికి, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులకు, సిబ్బందికి రాష్ట్రప్రభుత్వం అభినందనలు తెలిపింది.

# 46 సమాచార హక్కు చట్టం కేసుల పరిష్కారం

## - కమిషనర్ రేపాల శ్రీనివాసరావు




ఎవరైతే ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం పొందాలనుకుంటారో వారికి కావాల్సిన సమాచారాన్ని స్పష్టంగా అడిగినట్లయితే కమిషనర్ ద్వారా తగిన సమాచారం పొందగలుగుతారని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ రేపాల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదిన నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ హాలులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా 50 కేసుల విచారణ చేపట్టి 46 కేసులను పరిష్కరించడం జరిగిందని, వివిధ కారణాల వల్ల 4 కేసులు వాయిదా వేయడం జరిగిందని చెప్పారు. ఈ కేసుల విచారణ క్రమంలో 40 నుంచి 50 శాతం మంది మాత్రమే ఫిర్యాదుచేసిన వారు విచారణకు హాజరుకావడం జరిగిందని, అలాకాకుండా ఎవరైతే దరఖాస్తు పెట్టుకున్నారో, ఎవరైతే సంబంధిత అధికారుల మీద ఫిర్యాదు చేశారో, వారు విచారణకు హాజరై వారి వాదనలు వినిపించినట్లయితే ఇంకా మెరుగైన న్యాయం చేయడానికి కమిషనర్‌కు అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరైతే సమాచారం ఆశిస్తున్నారో వారికి క్షేత్రస్థాయిలోనే ఆ సమాచారం లభ్యం కావాలన్నారు. అందుకే ఈ మూడు రోజుల కార్యక్రమం ఏర్పాటు చేశామని, అధికారులకు కూడా ఆ మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీంతో ఆర్టీఐ చట్టం అమలు నెల్లూరు జిల్లాలో బాగా జరుగుతుందని ఆశిస్తున్నానని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జేసీ హరేందిరప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఆర్ఓ చిన్న ఓబులేశు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికల్లో ఎన్‌బికెఆర్ ఫస్ట్



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రాంగణం ఎంపికల్లో ఉత్తమంగా రాణిస్తున్నారని, ఇటీవల ఎంఫసిస్ కంపెనీ వారు చేసిన ఎంపికల్లో 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆ విద్యార్థుల ఎంపిక వెనుక అధ్యాపకుల కృషి, ముఖ్యంగా ప్రాంగణ ఎంపికల అధికారి డా.కిషొందర్ ఇప్పించిన శిక్షణ అమోఘమన్నారు. బిటెక్ చివరి సంవత్సరం చదువుకుంటున్న 256 మంది విద్యార్థులకు వివిధ బహుళజాతి కంపెనీల్లో సముచితమైన ఉద్యోగాలు లభించడం సంతోషదాయకమన్నారు. ఇటీవల కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 32 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ఎప్పటినుంచి ఈ వ్యవహారం జరుగుతుందో తెలియదు కానీ, పేదల బియ్యం అక్రమంగా తరలిపోతుండగా అధికారులు పెద్దఎత్తున ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను పట్టుకున్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని అల్లీపురం ప్రాంతంలో అక్రమంగా రవాణా అవుతున్న 32 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు ఈనెల 7న పట్టుకోవడంతో అక్రమార్కుల్లో దడపుడుతోంది. పట్టుకున్న బియ్యం ఖరీదు సుమారు 24 లక్షల రూపాయల దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొందరు అక్రమార్కులు దళారుల ద్వారా రేషన్‌బియ్యాన్ని సేకరించి, నెల్లూరు నగరంలోని శివారుప్రాంతాల్లో ఉన్న రైసుమిల్లుల్లో పాలిష్ పట్టించి పొరుగురాష్ట్రాలకు తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా అధికారులు నిఘా పెట్టారు. దీంతో ఈ రేషన్‌బియ్యం అక్రమరవాణా గుట్టు రట్టయింది. అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న లారీతో పాటు రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు అధికారులు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.రాజేశ్వరరెడ్డి పర్యవేక్షణలో అధికారులు ఆ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ అక్రమాలకు సంబంధించి నాగేశ్వరరావు, పెంచలయ్య తదితరులపై కేసులు నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసును నెల్లూరు రూరల్ పోలీసులకు అప్పగించడంతో వారు నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

## 'ప్రభా'తం

# భారత్‌కు స్వర్ణ సంబరం



గతంలో ఎప్పుడూ లేనివిధంగా దివ్యాంగుల విశ్వక్రీడల్లో (పారా ఒలింపిక్స్) భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శించారు. ఎవరూ ఊహించనివిధంగా భారత్‌కు పసిడి కాంతులు తెచ్చారు. మొత్తం19 పతకాలు సాధించి దివ్యాంగులైన మన క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. పతకాల పంట పండించి భారత ఘనకీర్తిని విశ్వవ్యాప్తంగా చాటారు. ఇటీవల టోక్యోలో జరిగిన పారా ఒలింపిక్స్‌లో త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించి భారత్‌కు స్వర్ణ సంబరాన్ని కానుకగా ఇచ్చి భరతమాత ముద్దుబిడ్డలనిపించుకున్నారు. పట్టుదల, కృషి ఉంటే..గుండెల్లో చెదరని ఆత్మవిశ్వాసం ఉంటే.. ఎవరైనా సరే, ఎన్ని కష్టాలనైనా అధిగమించి ఉన్నతస్థాయికి వెళ్తారని రుజువుచేశారు. ఏదేమైనా ప్రపంచ స్థాయి క్రీడల్లో ఇంతటి ఘనవిజయం దేశానికే గర్వకారణం.

గతంలో ఎప్పుడూ లేనివిధంగా దివ్యాంగుల విశ్వక్రీడల్లో (పారా ఒలింపిక్స్) భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శించారు. ఎవరూ ఊహించనివిధంగా భారత్‌కు పసిడి కాంతులు తెచ్చారు. పతకాల పంట పండిస్తూ భారత ఘనకీర్తిని విశ్వవ్యాప్తంగా చాటారు. టోక్యోలో జరిగిన పారా ఒలింపిక్స్‌లో త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించి భారత్‌కు స్వర్ణసంబరాన్ని కానుకగా ఇచ్చారు. ఒలింపిక్ ముగింపు రోజున కూడా ఏమీ తగ్గకుండా మన అథ్లెట్లు అద్వితీయమైన క్రీడా ప్రతిభతో రాణించి బంగారుపతకాలు సాధించారు. దివ్యాంగుల విశ్వక్రీడల్లో భారత్‌కు స్వర్ణాధ్యాయాన్ని లిఖించారు. ఇదెంతో అద్భుతం.. అపూర్వం.. చరిత్రాత్మకం కూడా. ఒలింపిక్స్ చివరిరోజున కూడా బ్యాడ్మింటన్‌లో ఒక స్వర్ణపతకం, మరో రజత పతకం సాధించి జయహో భారత్ అనిపించడం వారి క్రీడాస్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా 162 దేశాలు పాల్గొన్న ఈ దివ్యాంగుల విశ్వక్రీడల్లో భారత్‌కు 24వ స్థానం లభించడం గొప్ప విశేషం. ఈ ఒలింపిక్స్‌లో మొత్తం 19 పతకాలు సాధించి క్రీడారంగంలో దివ్యాంగులు తమ సత్తా చాటుకున్నారు. టేబుల్‌టెన్నిస్‌లో భవీనాబెన్ రజతపతకంతో ప్రారంభమైన పతకాల ప్రవాహం చివరిరోజు దాకా సాగింది. తొమ్మిది క్రీడాంశాల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు భారత్ నుంచి టోక్యోకు వెళ్లిన 54 మంది క్రీడాకారుల్లో ఇంత అమోఘమైన క్రీడా నైపుణ్యం ఉందని తొలుత ఎవరూ ఊహించను కూడా లేదు. వైకల్యాన్ని అధిగమించి అత్యంత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి దివ్యాంగులు అత్యుత్తమమైన రీతిలో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. వీరి క్రీడాస్ఫూర్తిని చూసిన క్రీడాకారులు, క్రీడాభిమానులంతా ఆనందపరవశులయ్యారంటే అతిశయోక్తి కాదు. 2016లో రియో క్రీడల్లో భారత్‌కు దక్కిన పతకాలు కేవలం నాలుగే. 1960 నుంచి ఇటీవల దాకా భారత్ సాధించిన పతకాలు పన్నెండయితే, ఇప్పుడు ఏకంగా 19 పతకాలు సాధించుకురావడం దేశానికే గర్వకారణం. బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జావెలిన్‌త్రో, డిస్కస్ త్రో, షూటింగ్, ఆర్చరీ, హైజంప్‌లలో 5 స్వర్ణపతకాలు సాధించడమే కాక, 8 రజత పతకాలు, 6 కాంస్య పతకాలు కూడా మన క్రీడాకారులు అందుకోవడం భారతీయులందరినీ ముగ్ధుల్ని చేసింది. షూటింగ్‌లోనే భారత్ ఏకంగా 5 స్వర్ణపతకాలు సాధించడం మరో విశేషం. వివిధ క్రీడల్లో తమ ప్రావీణ్యం చూపుతూ రజత, కాంస్య పతకాలు కూడా సాధించి మన దివ్యాంగ క్రీడాకారులందరూ భరతమాత ముద్దుబిడ్డలుగా ఘనకీర్తి సంపాదించుకున్నారు. జావెలిన్ త్రో ఎఫ్-64లో సుమిత్ బంగారుపతకాన్ని సాధిస్తే, డిస్కస్‌త్రోలో యోగేశ్ స్వర్ణం గెలుచుకొచ్చారు. హైజంప్‌లో నిషాద్, తంగవేలు, ప్రవీణ్, జావెలిన్ త్రోలో దేవేంద్ర రజతపతకాలు కైవశం చేసుకున్నారు. షూటింగ్‌లో ఒక స్వర్ణం, ఒక రజతం సాధించి అవని తన ప్రత్యేకతను చాటుకుంది. మనీశ్ శర్వాల్ షూటింగ్‌లో స్వర్ణపతకం అందుకుంటే, సింగ్‌రాజ్ ఒక రజతపతకం, మరో కాంస్యపతకం సాధించాడు. పారాలింపిక్స్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టిన బ్యాడ్మింటన్‌లో ప్రమోద్, కృష్ణనాగర్‌లు చెరొక స్వర్ణపతకం, సుహాస్ యతిరాజ్ రజతం, మనోజ్ కాంస్యపతకం సాధించి అందరినీ అబ్బురపరిచారు. ఆర్చరీలో హర్వీందర్ కాంస్యపతకం సాధించుకొచ్చాడు. ఇలా అందరూ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి ఒలింపిక్స్‌లో అదరగొట్టేశారు. ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా ప్రోత్సహించడంతో పాటు కేంద్రప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, భారత పారాలింపిక్ కమిటీ, కోచ్‌లు, ప్రభుత్వేతర సంస్థలూ ఇలా ఎంతోమంది ఎంతగానో సహకరించి చేసిన కృషి ఎట్టకేలకు ఫలించడమే కాక, దిగ్విజయమైంది. కరోనా ఒకవైపు భయపెడుతూనే ఉన్నా, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రప్రభుత్వం అన్నిచర్యలు తీసుకోవడంతో టోక్యో పారా ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు కొత్త అధ్యాయాన్నే కాదు విశ్వక్రీడల్లో కొత్త చరిత్రను, కొత్త శకాన్నే సృష్టించారు.

అసలే అనేక రకాలైన అంగవైకల్యాలతో చక్రాల కుర్చీలతో, కృత్రిమ అవయవాలతో, పనిచేయని కాళ్ళు, చేతులతో విశ్వక్రీడల వేదికపై నిలిచిన క్రీడాకారుల క్రీడాప్రతిభను చూస్తే అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న క్రీడాకారులకంటే గొప్పగానే ఆడారనే అనవచ్చు. పుట్టుకతో వికలాంగులు కొందరు, పోలియో బారిన పడినవారు మరికొందరు, ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన వారు ఇంకొందరు ఇలా విధివశాత్తూ అనేకరకాల వైకల్యాలకు గురైనా అంతులేని ఆత్మవిశ్వాసంతో అన్ని అవస్తలనూ అధిగమించడమే కాక, వైకల్యాల వల్ల వ్యక్తిగతంగా ఇంకా అనేకరకాల సమస్యలున్నా వాటిని కూడా భరించి, గుండె నిబ్బరంతో ముందుకు పయనించి దేశానికి ఇంత ఘనకీర్తిని తేవడం నిజంగా అద్భుతమే. ఎత్తు తక్కువగా ఉండి తానో మరగుజ్జు అంటూ చిన్నతనంలో అందరినుంచి అవహేళనకు గురైన రాజస్థాన్‌కు చెందిన కృష్ణ నాగర్ బ్యాడ్మింటన్‌లో మెరుపులు మెరిపించి బంగారు పతకం సాధించి.. అంతర్జాతీయస్థాయిలో ఎంతో ఎత్తుకు ఎదగడం క్రీడాలోకానికే కాదు మొత్తంగా దేశానికే స్ఫూర్తిదాయకం. పట్టుదల, కృషి ఉంటే.. గుండెల్లో చెదరని ఆత్మవిశ్వాసం ఉంటే..ఎవరైనా సరే, ఎన్ని కష్టాలనైనా అధిగమించి ఉన్నతస్థాయికి వెళ్తారనేందుకు కృష్ణ నాగర్ ఒక తాజా ఉదాహరణ. ఎంతోమంది దివ్యాంగులు అంతంతమాత్రంగానే ఉన్న అరకొర సదుపాయాలతోనే ఇంతటి ఘనవిజయం సాధించడం క్రీడాలోకానికే గర్వకారణం. ఇదే స్ఫూర్తితో.. 2024లో జరిగే ప్యారిస్ ఒలింపిక్స్‌లో ఎంతో ధీటుగా.. ఇంతకన్నా మిన్నగా మన క్రీడాకారులు పతకాలు సాధిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

# కరోనా తగ్గిందెక్కడా?



- చాపకింద నీరులా..కోవిడ్
- జిల్లాలో వెయ్యికి దాటిన కరోనా మరణాలు
- కోవిడ్ నిబంధనల పట్ల నిర్లక్ష్యం

జిల్లాలో కరోనా తగ్గిపోతుందని అనుకుంటున్నామే కానీ తగ్గడమే లేదు. ప్రతిరోజూ వందకు పైగానే కరోనా కేసులు వస్తూనే ఉన్నాయి. కరోనా మహమ్మారి వ్యాధి జిల్లాను ఇంకా వీడడం లేదు. రోజురోజుకీ కేసులు, కరోనా మరణాలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. ఈనెల 8వ తేది నాటికి జిల్లాలో మొత్తం కరోనా మరణాలు 1017కు చేరాయంటే కరోనా చాపకింద నీరులా మెల్లిగా ఎలా పెరుగుతూ ఉందో తేటతెల్లమవుతోంది. జిల్లాలో ఉన్నతాధికారులు, వైద్యాధికారులు, ఇతరత్రా అధికారగణమంతా కరోనా కట్టడికి నిరంతరం కష్టపడుతున్నా ఆ వ్యాధి వ్యాప్తి మాత్రం తగ్గడమే లేదు. రోజూ కనీసం వందమందికి పైగానే కరోనా అంటుకుంటూనే ఉంది. ఈనెల 8న ఒక్కరోజు 282 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. అదే రోజున కరోనా బారిన పడి మరో ముగ్గురు మరణించారు. జిల్లాలో ఇంకా 2259 యాక్టివ్ కేసులున్నాయి. టీకా వేస్తున్నా అందరూ వేయించుకోవడం లేదు. టీకా కార్యక్రమం కూడా పూర్తిస్థాయిలో జిల్లాలో పూర్తికాలేదు. ఇటీవల పాఠశాలలు కూడా తెరవడంతో పలుచోట్ల విద్యార్థులు కూడా ఈ వ్యాధికి గురవుతున్నారు. పరీక్షలు చేసేకొద్దీ కేసులు వస్తూనే ఉన్నాయి. అధికారగణం మళ్ళీ ఒకసారి కొరడా ఝుళిపిస్తే తప్ప పరిస్థితి ఒక కొలిక్కి రాదు.

### భౌతికదూరం.. హుష్ కాకీ!...


ప్రజల్లో కరోనా పట్ల అవగాహన ఉన్నా అనేకమందిలో కోవిడ్ నిబంధనల పట్ల, ముందుజాగ్రత్తలు తీసుకోవడంపట్ల అలక్ష్యంగా ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడచూసినా జనం గతంలో మాదిరిగా గుంపులు గుంపులుగా తిరుగుతుండడం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. భౌతికదూరం, సామాజిక దూరం వంటివన్నీ హుష్‌కాకీ అయిపోయాయి. ఎక్కడ చూసినా దుకాణాల వద్ద, మార్కెట్లలో కోవిడ్ నిబంధనలు నామమాత్రంగానే ఉన్నాయి. మునుపటిలా గట్టి చర్యలు తీసుకోకపోవడంతో నగరంలో కూడా పరిస్థితి మళ్ళీ అంతా మామూలైపోయింది. దీంతో కరోనా ఇదే సందని బాగా విజృంభిస్తోంది. సామాజిక దూరం పాటించడమన్నది అసలు కనిపించడం లేదు. పక్కపక్కనే నిలబడడం, మాట్లాడుకోవడం మళ్ళీ సర్వసాధారణమైపోయింది. అసలు మనల్ని రాచి రంపాన పెట్టడానికి కరోనా రాకాసి అనేదొకటి పొంచివుందనే స్పృహే జనంలో ఉండడం లేదు ఏ కొద్దిమందో జాగ్రత్తలు పాటిస్తున్నారు. చాలామంది మాస్కులు పెట్టుకోకపోవడం, ఒకవేళ పెట్టుకున్నా సక్రమంగా పెట్టుకోకపోవడం రోడ్ల మీద నిత్యం చూస్తూనే ఉన్నాం. నోరు, ముక్కుల ద్వారా కోవిడ్ వైరస్ ఊపిరితిత్తుల్లోకి చేరకుండా మాస్కు పెట్టుకోమంటే, మనవాళ్ళు ఫ్యాషన్‌గా గెడ్డానికి మాస్కులు తగిలించుకుని ఫోన్లలో నింపాదిగా మాట్లాడుకుంటూ రోడ్లపై వెళ్తుండడం అందరూ చూస్తున్నదే. కొంతమందైతే అసలు మాస్కులే పెట్టుకోవడం లేదు. ఎవరైనా అడుగుతారని చెవులకు తగిలించుకుంటున్నారంతే. సాధారణంగా బాగా రద్దీగా ఉండే కాఫీ హోటళ్లు, టీబంకులు, దుకాణాలు, సినిమాహాళ్ళు, మార్కెట్లు వగైరాల దగ్గర కూడా కోవిడ్ నిబంధనలు సక్రమంగా పాటించడం లేదు. అధికారులు ఎంతగా మొత్తుకుంటున్నా ఎవరి నిర్లక్ష్యం వారిదే అన్నట్లుగా తయారైంది పరిస్థితి. కోవిడ్ పూర్తిగా తగ్గిపోయిందనే భ్రమలో ఒకర్ని చూసి మరొకరు నిబంధనలు, జాగ్రత్తల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఈ వ్యాధి అంటుకుంటే ఎంత ప్రమాదమో, ఇంటిల్లిపాదీ ఎంత అవస్తలు పడాల్సి వస్తుందో ఇంకా చాలా మందికి అర్థం కావడం లేదు. కోవిడ్ బారిన పడ్డవారు ఎన్ని బాధలు పడ్డారో ప్రత్యక్షంగా పరోక్షంగా చూసినా ఇంకా గుణపాఠాలను మనం నేర్చుకోవడం లేదు. నిత్యం పేపర్లలో కరోనా వార్తలు, మరణాల వివరాలు వస్తూనే ఉన్నా, టీవీల్లో ఊదరగొడుతున్నా అవి మనకు సంబంధించినవి కాదులే అన్నట్లుగా నిర్లక్ష్యంగా ఉండడాన్ని ఏమనాలి?.. విద్యార్థులు, యువకులు కూడా ఎక్కువమంది ఇదే బాటలో నడుస్తున్నారు. ఈ నిర్లక్ష్యాలే ఆ రాకాసి వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అందులోనూ కరోనా మూడో దశ కూడా వచ్చే ప్రమాదం ఎంతైనా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం, అధికారులు నిత్యం హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా అనేకమంది ప్రజలు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఈ వ్యాధిపట్ల ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండి కరోనా సోకకుండా ముందుజాగ్రత్తలు పాటించాలి. ఇదేవిధంగా నిర్లక్షంగానే ఉంటే.. కరోనా ఎవరిని అంటుకుంటుందో తెలియదు. తీరా ఆ వ్యాధి వచ్చాక అప్పుడు విచారించి ప్రయోజనం ఏమీ ఉండదు!... తస్మాత్ జాగ్రత్త!...

# రోడ్ల దుస్థితిని పట్టించుకోండి సారూ




రోడ్లు నాగరికతకు చిహ్నాలంటారు. ఇప్పుడా రోజులు పోయాయి. పాతకాలంలో నెల్లూరు రోడ్లు ఎంతో సుందరంగా ఉండేవని పెద్దలు చెప్తుండేవారు. మట్టిరోడ్లు, ఎర్రమట్టి రోడ్లు ఉన్న ఆ కాలంలో కూడా రోడ్లు ఏళ్ళతరబడి చెక్కు చెదిరేవి కాదు. అంత నాణ్యత ఉండేది ఆ రోజుల్లో. తారురోడ్లు కూడా ఏళ్ళతరబడి బాగానే ఉండేవి. ఇటీవలికాలంలో సిమెంటు రోడ్లు వచ్చాయి. చూసేందుకు బాగానే ఉన్నా అంతా కాంక్రీటు మయం కావడంతో సెగ పెరిగిపోతోంది. ఒకవేళ ఇవి ఏ వానకో దెబ్బతింటే వాటిని బాగుచేసే నాథులుండడం లేదు. అందులోనూ బుల్‌డోజర్లు పెట్టేసి చకచకా రోడ్లు వేసేస్తున్నారు. పైపైనే మెరుగులు తప్ప, వానొస్తే ఆ వేసిన రోడ్డు ఎక్కడుందో కూడా తెలియని దుస్థితి. నాణ్యత అన్నది మచ్చుకు కూడా కనిపించదు. రోడ్లు గుంటలు పడిపోయినా కనీసం ప్యాచ్‌వర్క్‌లు కూడా ఎప్పటికప్పుడు సకాలంలో చేసేవారు లేరు. నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా అనేక రోడ్ల పరిస్థితి ఏళ్ళ తరబడిగా పరమ అధ్వాన్నంగా ఉంది. ఇటీవల వచ్చిన వానలకు ఆ రోడ్లు మరింత దయనీయంగా తయారయ్యాయి. దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేసే పరిస్థితి లేకపోవడంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఎంతో ఇబ్బందిగా ఉంది. ఇక పల్లెపట్టుల్లో, మారుమూల గ్రామాల్లో రోడ్ల దీనావస్త ఎంత చెప్పినా తరగదు. జిల్లా అభివృద్ధికి, నగరంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప వాస్తవంలో అన్నీ నామమాత్రంగానే ఉన్నాయి. ముఖ్యంగా నెల్లూరు నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా తయారైవున్నాయి. రోడ్డు వెడల్పుకని, వాటర్ పైప్‌లని, ఫ్లైఓవర్‌లని ఎక్కడపడితే అక్కడ రోడ్లు తవ్వేసి ఉన్నారు. వానొస్తే ఆ రోడ్లన్నీ బురదమయమైపోతున్నాయి. ఇకనైనా పాలకులు, ప్రభుత్వాధికారులు జిల్లాలో రోడ్లను బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.

– ఇ. దయాశర్మ, రాపూరు.



# మహమ్మారి వ్యాధులను ఎదుర్కోవాలి

- పరిశోధనలను మరింత ముమ్మరం చేయాలి
- శాస్త్రవేత్తలకు ఉప రాష్ట్రపతి వెంకయ్య పిలుపు

*దేశాన్నే కాక, ప్రపంచాన్నంతా గగ్గోలు పెట్టిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధి నిరోధానికి నిరంతరం కృషిచేస్తున్న 25మంది శాస్త్రవేత్తలను, డిఆర్‌డిఓ ఛైర్మెన్ డాక్టర్ సతీష్‌రెడ్డిని భారత ఉప రాష్ట్రపతి ఇటీవల ఢిల్లీలోని తమ నివాసానికి ఆహ్వానించి, వారు చేస్తున్న పరిశోధనలను తెలుసుకుని అభినందించారు. ఇంతకాలంగా అపారమైన సేవలందిస్తున్నందుకు వారిని అభినందించారు. భవిష్యత్తులో ఎలాంటి మహమ్మారి వ్యాధులనైనా ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలంతా సిద్ధంగా ఉండాలని కర్తవ్యబోధ చేశారు.*

కరోనా వంటి మహమ్మారి వ్యాధులను ఎదుర్కొనేందుకు, భవిష్యత్తులో కూడా అలాంటి భయంకర వ్యాధులను నిరోధించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటినుంచే ఆ దిశగా తమ పరిశోధనలను ముమ్మరం చేయాలని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు. కరోనాను జయించేందుకు జరుగుతున్న పోరాటంలో డిఆర్‌డిఓకు చెందిన డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియాలజీ, అలైడ్ సైన్సెస్ (డిఏపిఏఎస్)కు చెందిన శాస్త్రవేత్తలతో పాటు ముందువరుసలో ఉండి సేవలందించిన వైద్యులు, ఇతర రంగాల వారి సహకారం అభినందనీయమని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇటీవల డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన డాక్టర్ సతీష్‌రెడ్డితో పాటు, డిఐపిఏఎస్‌కు చెందిన 25 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను ఉప రాష్ట్రపతి తమ నివాసానికి ఆహ్వానించి వారితో కొంతసేపు మాట్లాడారు. కోవిడ్-19కు చికిత్స, దాని నిరోధానికి అనేకరకాల స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి చేసిన డిఐపిఏఎస్, డిఆర్‌డిఓ ల్యాబ్‌ల సేవలను ఆయన అభినందించారు. కోవిడ్-2వ దశ నేపథ్యంలో ఈ మహమ్మారి వ్యాధులు తిరిగి ఏ క్షణమైనా మరింత విజృంభించే ప్రమాదం ఉందని, ఎంతటి ప్రతికూల పరిస్థితినైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలంతా సిద్ధంగా, అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తొలుత కోవిడ్-19 చికిత్సకు డిఆర్‌డిఓ ల్యాబ్స్ ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన వివిధ ఉత్పత్తులు, పరికరాల గురించి డాక్టర్ సతీష్‌రెడ్డి ఉప రాష్ట్రపతికి వివరించారు. అనంతరం, శాస్త్రవేత్తలను, నిపుణులను ఆహ్వానించి తమ అభిప్రాయాలను, ఆలోచనలు వారితో పంచుకున్నందుకు డాక్టర్ సతీష్‌రెడ్డి ఉప రాష్ట్రపతికి తమ కృతజ్ఞతలు తెలిపారు. డిఐపిఏఎస్ సంచాలకులు డాక్టర్ రాజీవ్ వర్షిణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి.. 2 లక్షల విరాళం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరు గోమతినగర్ నివాసి దేవళ్ల శ్యామలమ్మ రెండు లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. తన సోదరులు స్వర్గీయ పలగాని రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం వారి సమీప బంధువులు రాజగోపాలరెడ్డి, వినయ్‌కుమార్‌లతో కలసి ఈనెల 7న ఆమె రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి ఆ విరాళం అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. తమ సోదరుడు గతంలో ఈ ఆసుపత్రికి లక్ష రూపాయల విరాళం ఇచ్చారని, ఇప్పుడిస్తున్న మొత్తాన్ని పేద క్యాన్సర్ రోగుల వైద్యం కోసం వినియోగించాలని దాత శ్యామలమ్మ కోరారు.

## జన్మభూమిపై మమకారం చాటుకున్న సుంకు సాయి ప్రకాష్




దుబాయ్‌లో నివసిస్తున్న ప్రముఖ ఆడిటర్, మన నెల్లూరీయుడు సుంకు సాయిప్రకాష్ జన్మభూమిపై తన మమకారాన్ని చాటుకున్నారు. కరోనా కష్టకాలంలో ఓర్పుతో సహనంతో రోగులకు తమ సేవలు అందించిన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ఒక నెలకు సరిపడా నిత్యావసరాలను ఉచితంగా అందచేశారు. సత్య సాయి సేవకుడైన సాయిప్రకాష్, బాబా పేరుమీద ఈ బృహత్కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 7వ తేదీ నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (పెద్దాసుపత్రి)లో 250 మంది నర్సులకు, సిబ్బందికి ఈ సరుకులను అందచేశారు. మనిషి ఎక్కడున్నా మనసు నెల్లూరుపై ఉందని సుంకు సాయిప్రకాష్ ఈ సేవా కార్యక్రమం ద్వారా నిరూపించారు.



## సివిల్ సర్వీసెస్ పరీక్షలపై.. విఎస్‌యులో అవగాహన సదస్సు

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఈనెల 6న ఏపి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల అవగాహనకు ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించారు. త్రిపుర మాజీ ముఖ్యకార్యదర్శి, రిటైర్ట్ ఐఏఎస్ ఆఫీసర్ యు.వెంకటేశ్వర్లు, ఏపి స్టడీసర్కిల్ డైరెక్టర్ పాల్గొన్నారు. ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు తయారవడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమం గురించి ఆయన విద్యార్థులకు అవగాహన కలిగించారు. శిక్షణా తరగతులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈనెల27న ఏపి స్టడీసర్కిల్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం పేద విద్యార్థులకు, బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి పేర్కొన్నారు.



## ఎత్తయిన వంతెనలతో రైతులకు కష్టాలు

### - మాజీమంత్రి సోమిరెడ్డి



జిల్లాలోని జాతీయరహదారికి సంబంధించి మనుబోలు మండలం పరిధిలో నిర్మిస్తున్న ఎత్తయిన వంతెనలతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కండలేరు, పంబలేరు వరద ప్రవాహ ప్రభావం జాతీయరహదారిపై పడకుండా నిర్మిస్తున్న వంతెనతో రైతులకు సమస్య ఏర్పడుతుందని, చాలా ఎత్తుగా బ్రిడ్జి నిర్మిస్తుండడంతో బద్దెవోలు క్రాస్‌రోడ్డు నుంచి మనుబోలు దాకా రెండువైపులా రైతులు తమ పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేకుండాపోతుందని అన్నారు. అవసరానికి మించి ఎత్తయిన బ్రిడ్జిలను నిర్మించడం సముచితం కాదని, ఏటికాలువలపై ఆక్రమణలు తొలగించి వరద ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ భారీ బ్రిడ్జిల కారణంగా హైవే పక్కనున్న భూముల విలువ బాగా తగ్గిపోతుందన్నారు. జాతీయ రహదారి అధికారులకు జవాబుదారీతనం లేదా?. రైతుల ఇబ్బందులు పట్టవా?.. అని ఆయన మండిపడ్డారు. రైతులకు సమస్య లేకుండా చూడాలంటూ ఆయన ఇటీవల నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, బొమ్మి సురేంద్ర, జన్ని రమణయ్య, ఓ.సంపత్ యాదవ్, నాగేంద్రప్రసాద్, రాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'నుడా' అంటే.. నగరాభివృద్ధికి మారుపేరని నిరూపిస్తాం

*ఇటీవలే 'నుడా' ఛైర్మెన్ పీఠమెక్కిన ముక్కాల ద్వారకానాథ్ నగరాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ 'నుడా'ను నికార్సయిన నగరాభివృద్ధి సంస్థగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ప్రకటించారు. పాలనలో పారదర్శకతను ప్రదర్శిస్తామని, పేదలు, మధ్యతరగతి వారు, మొత్తంగా ప్రజలందరికీ తమవంతు సేవలందిస్తామని తెలిపారు. నుడా ఛైర్మెన్ అయ్యాక ఈనెల 4న ఆయన నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న నుడా కార్యాలయలో తొలిసారిగా విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి తాను చేయదలచుకున్న కార్యక్రమాలను సూచనప్రాయంగా వెల్లడించారు. తొలుత ఆయన నెల్లూరు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.*



- ఛైర్మెన్ ముక్కాల

ప్రజలెంతో కష్టపడి తాము సంపాదించుకున్న డబ్బులో కొంతమొత్తాన్ని పొదుపు చేసుకుని ఇంటిస్థలానికో, ఇంటి నిర్మాణానికో ఖర్చుపెడుతుంటారని, అలాంటి వారికి ఎలాంటి నష్టం కలుగకుండా చూడాలన్నదే తన అభిమతమని నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ చెప్పారు. నుడా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా లేఅవుట్లను ఏర్పాటుచేసి అన్ని వసతులతో ప్రజలకు విక్రయించడం జరుగుతుందని, నుడాను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు లేఅవుట్లను ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఇప్పటికే కావలిలో 97 ఎకరాలు, గూడూరులో 35 ఎకరాలు నుడాకు కేటాయించి ఉన్నాయని, వీటిలో లేఅవుట్లు వేసి రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో ప్రజలకు ప్లాట్లు అందించనున్నామని ఆయన తెలిపారు. నుడా పరిధిలో ఆగిన అభివృద్ధి పనులను కొనసాగిస్తామని, ఇప్పటికే 50 పార్కుల అభివృద్ధికి కృషి జరుగుతోందని చెప్పారు. త్వరలో నెక్లెస్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని, నగరంలో నుడా కార్యాలయానికి శాశ్వత భవనవసతి కలిగించేందుకు కూడా కృషిచేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే నుడా కార్యాలయం నుంచి కొత్తగా 'యాప్' కూడా ప్రారంభమవుతుందని, అందులో నుడా పరిధిలో అప్రూవల్ ఇచ్చిన లేఅవుట్ల వివరాలు సమగ్రంగా ఉంటాయని, ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలకు ఆయా ప్లాట్లకు అప్రూవల్ ఉందో లేదో తెలిసిపోతుందని వివరించారు.

### అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు :

నుడా పరిధిలో ఏర్పాటుచేసే ప్రతి లేఅవుట్‌కు తప్పనిసరిగా నుడా అనుమతి ఉండాలని, నుడా నియమ నిబంధనలను అనుసరించకుండా ఎవరి చిత్తానుసారం వారు వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ లేఅవుట్‌లపై కఠినచర్యలు తీసుకుంటామని, నుడా నిబంధనల ప్రకారం ప్రతి రియల్‌ఎస్టేట్ వ్యాపారి, బిల్డర్, సంబంధిత ఉద్యోగులు, అధికారులందరూ వ్యవహరించాల్సి ఉంటుందని, నుడా అప్రూవల్ ఉంటేనే లేఅవుట్‌లో ప్లాట్లు కానీ, అపార్ట్‌మెంట్లలో ఇళ్ళను కానీ కొనాలని స్పష్టం చేశారు. అనుమతి లేని లేఅవుట్లలో స్థలాలను కొనుగోలు చేయవద్దని ఆయన ప్రజలకు సూచించారు. బిల్డర్లు లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, కాలువలు తదితర సౌకర్యాలన్నీ ఉండేలా చూడాలని, పచ్చదనం పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నుడా అప్రూవల్ పొందిన లేఅవుట్ల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నుడా అప్రూవల్ లేని కొన్ని లేఅవుట్లను ఇటీవల అధికారులు గుర్తించి వాటిని నిలిపివేశారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా నుడాను సంప్రదించాలని, అంతేకానీ మధ్యవర్తులతో బేరసారాలు సాగించవద్దని సూచించారు.

# తండ్రి బాటలో తనయుడు

## గాండ్ల, తెలికుల సంఘానికి.. రాష్ట్ర నేతగా.. 'మురళీకృష్ణ' సుబ్బారావు



నెల్లూరులోని మురళీకృష్ణ హోటల్స్ అధినేత, దివంగత గ్రోసు గోపాలయ్య తాను హోటల్ రంగంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తనవారిని, తమ కులస్తులైన గాండ్ల, తెలికులను ఆయన ఏనాడూ విస్మరించలేదు. ఒక్క మన జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గాండ్ల, తెలికుల కులస్తుల అభ్యున్నతికి కంకణం కట్టుకుని గాండ్ల తెలికుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉంటూ జీవితాంతం వారి అభివృద్ధికి ఎంతో కృషిచేశారాయన. ఇప్పుడు ఆయన కుమారుడైన 'మురళీకృష్ణ' సుబ్బారావు కూడా తండ్రి బాటలో నడుస్తూ.. ఆయన ఆశయాల సాధనకు నడుం బిగించి తండ్రికి తగ్గ తనయుడనిపించు కుంటున్నాడు. గోపాలయ్య మరణంతో ఆ స్థానంలో యువకుడు, సంఘ సేవాభిలాషి అయిన ఆయన కుమారుడు సుబ్బారావే సరైన నాయకుడని సంఘం వారంతా నిర్ణయించుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో సుబ్బారావును రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరవ అనంతం, ప్రధాన కార్యదర్శిగా బొర్రా మధుసూదన్, కోశాధికారిగా గార్లదిన్నె నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, జాతీయస్థాయిలో సంఘానికి మంచి గుర్తింపు వచ్చేందుకు కృషిచేస్తానని సుబ్బారావు ఈ సందర్భంగా చెప్పారు.

# సెలవుపై వెళ్ళిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు వ్యక్తిగత కారణాలతో ఈనెల 3 నుంచి 9వ తేది దాకా సెలవుపై వెళ్ళారు. 10న వినాయకచవితి, 11న రెండో శనివారం, 12న ఆదివారం రావడంతో తిరిగి ఆయన 13న విధులకు హాజరు కానున్నట్లు సమాచారం. అప్పటిదాకా జేసీ హరేందిరప్రసాద్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు.

# గణేష్ ఉత్సవాలపై ఆంక్షలా?




● బిజెపి ఆందోళన

ప్రజలందరూ ఎంతో సంతోషంగా జరుపుకునే వినాయకచవితి వేడుకలపై ఆంక్షలేమిటంటూ ఈనెల 6న నెల్లూరులోని బిజెపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆంక్షలు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వారు నగరంలోని విఆర్‌సి సెంటర్ నుంచి కలెక్టరేట్ దాకా ప్రదర్శన నిర్వహించి, కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించారు. వినాయకచవితి బహిరంగ వేడుకలకు అనుమతించాలని కోరుతూ ఇన్‌చార్జి కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, నగరంలోని బిజెపి నాయకులు పి.సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, బి. శ్రీనివాసులు, బి.విజయ కుమార్, రాజేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియా ఫ్రీడం రన్



ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న నెల్లూరులోని 10-ఆంధ్ర నావికాదళ విభాగం అసోసియేట్ ఎన్‌సిసి అధికారి గుండా నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ కార్యక్రమం జరిగింది. ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. దేశంలోని పౌరులంతా సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్‌సిసి క్యాడెట్లు, సిబ్బంది అప్పారావు, రమణ, అల్తాఫ్, రామన్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### తల్లిదండ్రులను

# నిర్లక్ష్యం చేస్తే సహించం

**- జిల్లా ఎస్పీ విజయారావు హెచ్చరిక**



తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ అనేక ఫిర్యాదులు వస్తుండడంతో జిల్లా ఎస్పీ విజయారావు ఆ విషయంపై దృష్టి సారించారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వారి పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహించడం దారుణమని, వృద్ధులకు వారి పిల్లలు న్యాయం చేయాలని, లేకుంటే వెంటనే కేసులు నమోదు చేయాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 6 సోమవారం రోజున జరిగిన 'స్పందన' కార్యక్రమంలో పలువురు వృద్ధులు తమను పిల్లలు సరిగా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేయడంతో ఎస్పీ స్పందించారు. కని, పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్య సమయంలో సక్రమంగా చూసుకోకపోవడం అన్యాయమన్నారు. తమ పిల్లలు తమను వేధిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వచ్చాయని, వెంటనే పరిశీలించి వృద్ధులకు న్యాయం చేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు. ప్రతి శనివారం 'స్పందన'కు సంబంధించిన ఫిర్యాదులన్నిటినీ సమీక్షిస్తామని, ఆ లోపు ఈ సమస్యలన్నీ పరిష్కారమై ఉండాలని ఆయన పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం దూరప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు భోజన సదుపాయం కలిగించారు. ఏఎస్పీ వెంకటరత్నం, డిఎస్పీలు హరనాథ్‌రెడ్డి, శ్రీనివాస రావు, ఏఆర్ డిఎస్పీ గాంధీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్లు ఖాజావలి, రామకృష్ణ, ఏఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటు హెడ్‌కానిస్టేబుళ్ళు వేణు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ కవచం..'దిశ' యాప్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దిశ' యాప్ మహిళల రక్షణ కవచం వంటిదని నెల్లూరులోని దర్గామిట్ట సిఐ దశరథరామారావు అన్నారు. స్థానిక ఎంజిబి మాల్‌లో మహిళలు, విద్యార్థినులకు ఈనెల 6న ఆయన 'దిశ' యాప్‌పై అవగాహన కలిగించారు. మహిళలంతా తప్పనిసరిగా ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజలకు అదనపు భారం పడుతోందని, ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజల జీవనం అస్తవ్యస్తంగా ఉంటే విద్యుత్ చార్జీలు కూడా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం దారుణమంటూ ఈనెల 6న నెల్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నగరంలోని మాగుంట లేఅవుట్, కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలు చేపట్టారు. పలు డివిజన్లలోని సిపిఎం శాఖల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఏడాది నుంచి కిలోవాట్‌కు 10 రూపాయల వంతున పెంచి, ఇప్పుడు మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పరిశీలించి విద్యుత్ చార్జీలను తగ్గించాలని వారు కోరారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, కిన్నెర కుమార్, కె.శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, చిట్టిబాబు, శ్రీనివాసులు, గురవయ్య, మణి, గోపి, రహీం, బాబు పాల్గొన్నారు.

# చట్టాలను బాగా అర్థం చేసుకోండి

**మహిళా పోలీసులకు శిక్షణలో డిఎస్పీ**



చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని, వాటిని బాగా అర్థం చేసుకుని విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించాలని నెల్లూరు నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో మహిళా పోలీసులకు వారం రోజుల పాటు జరిగే శిక్షణను ఆయన ఈనెల 3న ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులకు కేటాయించిన వార్డు, డివిజన్లలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు, చిన్నారులు వృద్ధులపై దాడులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. దిశ చట్టంపై మహిళలకు అవగాహన పెంచి మహిళలంతా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేవిధంగా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం సిఐలు అన్నవర్‌బాసా, దశరథరామారావు పలు చట్టాలపై మహిళా పోలీసులకు వివరించి అవగాహన కలిగించారు. ఎస్‌ఐలు భాస్కర్‌రావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'విపిఆర్ విద్య'లో గురుపూజోత్సవాలు

మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 5న నెల్లూరులోని 'విపిఆర్ విద్య'లో గురుపూజోత్సవాలు ఘనంగా జరిగాయి. విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి మాజీ సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు చెప్పారు.

# రెడ్‌క్రాస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో ఈనెల 6న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్ ఎం.వి సుబ్బారెడ్డి, కో-కన్వీనర్ జ్యోత్స్న, మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రఘు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథంను సత్కరించారు.

# పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, తాము ఆరోగ్యంగా ఉంటూ బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండేలా చూసుకోవాలని నెల్లూరు అర్బన్ సిడిపిఓ అనూరాధ చెప్పారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల నగరంలోని జ్యోతినగర్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలను భుజించాలని, తరచుగా ఆకుకూరలు, గుడ్డు, పాలు వగైరాలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణపోషణ పథకం కింద గర్భిణులకు, శిశువులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తోందని, వాటిని లబ్దిదారులకు అందజేసి సద్వినియోగం చేయాలన్నారు. అంగన్‌వాడి సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎంలు సుజాత, ప్రశాంతితో పాటు భారతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



## పెంచలకోన ఆలయం
# రెండో ద్వారానికి వెండి తొడుగులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న ఆదిలక్ష్మీదేవి–చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో రెండవ ద్వారానికి ఈనెల 5న వెండితొడుగులు అమర్చి ఆలయాన్ని మరింత శోభాయమానం చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వచ్చి దిష్టితీసి ఈ వెండి ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం విశిష్టపూజలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. కడపజిల్ల పొద్దుటూరుకు చెందిన భక్తులు కె.రామకృష్ణారెడ్డి–దస్తగిరమ్మ దంపతులు 73.500 కిలోగ్రాములు ఉన్న ఈ వెండి తొడుగులను ఆలయం రెండో ద్వారాన్ని అమర్చారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే ఆనం అభినందించారు. ఆలయ ఇఓ వెంకటసుబ్బయ్య, ఆలయ అర్చకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# 'విశ్వసాయి'లో గురు వందనం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాల సందర్భంగా ఈ నెల 5న నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కాలేజీలో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డా.ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్య వివేచనను కలుగజేస్తుందని, సమాజం ఉన్నతికి, సృజనాత్మకతకు అద్దంపడుతుందని చాటిన ఉదాత్తుడు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. అనంతరం అధ్యాపకులంతా కలసి కళాశాల ఛైర్మెన్, ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్‌లను గురువులుగా భావించి సత్కరించారు. ఛైర్మెన్ సత్యనారాయణ, ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి, వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లతో పాటు కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



# నిండుగా.. సోమశిల జలాశయం

సోమశిల జలాశయంలో పైతట్టు ప్రాంతాల నుంచి వరదనీళ్లు వస్తుండడంతో జలాశయం నిండుకుండగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహం ఇంకా వస్తూనే ఉండడంతో జలాశయం పుష్కలంగా నీళ్లతో కళకళలాడుతోంది. అయితే వరద ప్రవాహం ఇంకా వస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు పంపాలని అధికారులు భావిస్తున్నారు. సోమశిల నీటి సామర్థ్యం 78 టిఎంసిలు కాగా ఈనెల 6వ తేది నాటికి 70 టిఎంసిలకు చేరుకుంది. నీటిమట్టం 72 టిఎంసిలకు చేరుకోగానే గేట్లు ఎత్తివేసి కొంతనీటిని దిగువకు పంపాలని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. 5వ తేదీన 25,524 క్యూసెక్కులు, 6న 27,386 క్యూసెక్కుల వరదనీటి ప్రవాహం జలాశయానికి చేరింది. దీంతో జిల్లాలోని డెల్టా ప్రాంతానికి 1100 క్యూసెక్కులు, ఉత్తరకాలువ ద్వారా 80 క్యూసెక్కులు, కండలేరు జలాశయానికి మరో 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఒకవేళ సోమశిల జలాశయం గేట్లు ఎత్తివేసే అవకాశం ఉంది కనుక దిగువ ప్రాంతాల వారు ముఖ్యంగా పెన్నానదీతీరంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఆత్మకూరు సిఐ వేణుగోపాల్‌రెడ్డి ఈనెల 6న సోమశిల జలాశయాన్ని పరిశీలించి పరిస్థితులను అంచనా వేశారు. జలాశయం క్రస్ట్‌గేట్ల నుంచి భారీస్థాయిలో వరదనీటి ప్రవాహం విడుదల చేయనున్నారని, పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు ముందుజాగ్రత్తతో ఉండాలని ఆయన కోరారు. సచివాలయ అధికారులు, మహిళా పోలీసులు వెంటనే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

# దేశానికే ఆదర్శం.. సచివాలయ వ్యవస్థ
## - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల కోవూరు మండలంలోని పడుగుపాడులో కొత్తగా ఏర్పాటైన సచివాలయం ప్రారంభోత్సవం జరిగింది. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావుతో కలసి ప్రసన్న ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకువెళ్లే ఈ వ్యవస్థ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంటోందని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. పడుగుపాడు సచివాలయం కార్పొరేట్ ఆఫీసులాగా ఉందంటూ ప్రశంసించారు. అనంతరం కోటి 16 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్లను ఎస్పీ విజయారావు చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఏఎస్పీ వెంకటరత్నం, డిఎస్పీ హరినాథ్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఎఎబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, బొందిలి సంఘం ఛైర్మెన్ కిషోర్‌సింగ్, సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఉప సర్పంచ్ షేక్ అహ్మద్, నాయకులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు ప్రసన్న ఆర్థికసాయం

ఈ సందర్భంగా పలువురు బాధితులకు ఎమ్మెల్యే ప్రసన్న ఆర్థిక సాయం అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలతో రాణిస్తున్న ఇద్దరు విద్యార్థులకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న 20వేల రూపాయలను సాయంగా అందజేశారు. కిడ్నీలు దెబ్బతిన్న ఓ చిన్నారికి 50 వేలు, తల్లిదండ్రులు మరణించడంతో ఒంటరైపోయిన ఓ యువకునికి సాయంగా 50 వేలు, రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్న మరో చిన్నారికి 50 వేల వంతున ఆర్థికసాయాన్ని ఎస్పీ చేతుల మీదుగా అందించారు.

## పెన్నా వంతెన
# పూర్తయ్యేదెప్పుడో?
## జనసేన నాయకుల విమర్శ



పెన్నా వంతెన పూర్తయ్యేదెప్పుడో?.. ఎవరికీ అర్థంకాని పరిస్థితి తయారైందని జనసేన నాయకులు విమర్శించారు. దశాబ్దాల తరబడిగా ఇది నత్తనడక నడుస్తూనే ఉందంటూ ధ్వజమెత్తారు. జనసేన రాష్ట్ర కార్యవర్గం వారు ఇటీవల నెల్లూరుకు వచ్చిన సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నగర నాయకులు సుజయ్‌బాబు ఆధ్వర్యంలో పెన్నా వంతెనను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 70 ఏళ్లకు పైగానే పెన్నా వంతెన ఉందని, ఇటీవలి కాలంలో ఎన్నో మరమ్మతులకు గురై ఉందని, కొత్త వంతెన నిర్మిస్తామన్న ప్రతిపాదనలు ఏమయ్యాయో తెలియడం లేదని అన్నారు. నగరానికి ప్రవేశవారధిగా ఉన్న ఈ వంతెన బాగోగులను ప్రభుత్వం వెంటనే పట్టించుకోవాలని కోరారు. జనసేన రాష్ట్ర నాయకులు గంటా స్వరూప, విజయ్ శేఖర్, కొట్టె వెంకటేశ్వర్లు, కత్తి తిరుమలతో పాటు జిల్లా నాయకులు ప్రశాంత్‌గౌడ్, పూసల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.






# 'ఫ్రెండ్స్ వాకర్స్' ఉపాధ్యాయ దినోత్సవం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి పదిమంది ఉపాధ్యాయులను సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఆ మహనీయుడు పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో 203 జిల్లా గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి, వాకర్స్ డెప్యూటి గవర్నర్ వేలూరు రంగారావు, గౌరవాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, ఉపాధ్యక్షులు కొండూరు సుబ్బారావు, ట్రెజరర్ మాగంటి ప్రసాద్, దొడ్ల జయరామనాయుడు, వి.లక్ష్మీనారాయణరెడ్డి, వినుకొండ సోను తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లలోనే వినాయక చవితి

ప్రతి ఏటా అంగరంగవైభవంగా జరిగే వినాయకచవితి వేడుకలు ఈసారి కూడా వెలవెలబోనున్నాయి. కరోనా నేపథ్యంలో వినాయకచవితి సంబరాలు రద్దయ్యాయి. అందువల్ల అందరూ ఇళ్ళలోనే చవితి వేడుకలు జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిషిద్ధమని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీధుల్లో, కూడళ్లలో ఉత్సవ సంబరాలు నిర్వహించవద్దని, కూడళ్లలో వినాయక విగ్రహాలను పెట్టడం, ఊరేగింపులు చేయడం వంటివన్నీ ప్రభుత్వం నిషేధించిందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



# చీఫ్ జస్టిస్ రమణకు అభినందనలు!



ఆడింది ఆటగా... పాడింది పాటగా... చేసింది శాసనంగా... చెప్పిందే నీతి వాక్యంగా గత ఏడేళ్లుగా చలామణి అవుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మొదటిసారిగా చిరు చమటలు పడుతున్న సూచనలు కనపడు తున్నాయి. చేసిందే దర్యాప్తు... వేసిందే ఛార్జ్‌షీట్... అన్నట్టుగా 'కులాసా'గా, తీరు బడిగా సాగుతున్న సీబీఐకి ఉక్క పోయడం మొదలైంది.

ఇప్పటివరకు 'మెత్తగా...' ఉన్నట్టు కన బడుతూ వచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమణ, ఇప్పుడు 'కఠినంగా... దృఢంగా... సీరియస్‌గా' కనబడుతున్నారు, కేంద్ర ప్రభుత్వ పెద్దలకు. ప్రజలకు మాత్రం ఎడారిలో ఒయాసిస్‌లా... మండు వేసవిలో వర్షించిన తొలి జల్లులా కనబడు తున్నారు. దేశంలోని ట్రిబ్యునల్స్‌కు న్యాయమూర్తులను నియ మించకపోవడానికి సంబంధించి కేంద్రంపై ప్రధాన న్యాయ మూర్తి కళ్లెర్ర చేశారు. వచ్చే సోమవారంలోపు కేంద్రం సమా ధానం చెప్పకుండా... దాటవేత ధోరణి ప్రదర్శిస్తే కేంద్రంపైనే 'కోర్టు ధిక్కార' చర్యలు చేపట్టే విషయాన్ని పరిశీలిస్తామని ఆయన నేతృత్వంలోని ధర్మాసనం హెచ్చరించింది. ఇక, సీబీఐని అయితే సుప్రీం కోర్టు డొక్కలో ఓ పోటు పొడిచినంత పనిచేసింది.

"అసలు ఇప్పటిదాకా ఎన్ని కేసుల్లో దర్యాప్తు ప్రారం భించారు? ఎన్ని కేసుల్లో ఛార్జ్‌షీట్లు వేశారు? ఎన్ని కేసుల్లో తీర్పులు వచ్చాయి? ఎన్ని కేసుల్లో మీరు గెలిచారు? ఎన్ని కేసుల్లో మీరు గెలవలేదు? మీ ఛార్జ్ షీట్లు నిలబడకపోవడానికి కారణాలు ఏమిటి? అంటూ జస్టిస్ రమణ ధర్మాసనం సీబీఐపై ప్రశ్నల వర్షం కురిపించింది. సీబీఐ డైరెక్టర్‌కు నోటీస్ జారీచేసింది. అఫిడవిట్ వేయమంది. అఫిడవిట్‌లో అసత్యాలు రాయడం కుదరదు. అఫిడవిట్ వేస్తే సీబీఐ బండారం బయటపడిపో తుంది. దానితో, ఈ ప్రశ్నలకు ఏ సమాధానం చెబితే ఏమిటి పర్యవసా నమో అర్థం కాక సీబీఐ వారు గుడ్లు మిటకరించి... నేల చూపులు చూస్తున్నారు.



మనలో మాట 36

అటు కేంద్రం, ఇటు సీబీఐపై ఈ మాత్రం కొరడా ఝళి పించిన న్యాయమూర్తి ఈమధ్యకాలంలో కనపడలేదు. అందు వల్లనే, సుప్రీం కోర్టు అనేది ఒకటి ఉన్నదనే భావన కేంద్రంలో గానీ, హైకోర్టు ఒకటి ఉన్నదనే భావన రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ మొదటిసారిగా స్ఫురణకు వస్తున్నది.


జస్టిస్ రమణ నేతృత్వంలో భారత న్యాయవ్యవస్థ క్రియా శీలకంగా వ్యవహరిస్తున్నదనడంలో సందేహం లేదు. 'కోర్టు ధిక్కరణ' చర్యలలో భాగంగా ఒకేసారి అయిదుగురు ఐ.ఏ.ఎస్ అధికారులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏకంగా జైలుశిక్ష, జరిమానాలు విధించడం న్యాయవ్యవస్థ ఈ క్రియాశీలకతకు నిదర్శనంగా భావించవచ్చు. జస్టిస్ రమణ భారత ప్రధాన న్యాయమూర్తిగా దేశానికి సేవలు అందించాల్సి ఉన్న మరో ఏడాది కాలం భారత న్యాయవ్యవస్థకు 'స్వర్ణ యుగం' అని చెప్పవచ్చు.

* ఒకేసారి తొమ్మిది మంది న్యాయమూర్తులను సుప్రీం కోర్టుకు సిఫారసు చేస్తే, కేంద్రం వారం రోజుల్లో ఆమోదించింది.
* ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఒకేసారి సుప్రీం కోర్టులో అడుగు పెట్టడం... సుప్రీం చరిత్రలో ఇదే మొదటిసారి.
* సుప్రీం కొలీజియం సిఫారసులను మోదీ ప్రభుత్వం ఓ వారం రోజుల్లోనే ఆమోదించడం కూడా ఇదే మొదటిసారి.
* దేశంలోని 12 హైకోర్టులకు 68 మంది న్యాయమూర్తుల నియామకానికి ఒకేసారి సుప్రీం కోర్ట్ కొలీజియం సిఫారసు చేయడం కూడా ఇదే మొదటిసారి.

జస్టిస్ రమణ పుణ్యమా అని తమకూ కొన్ని పరిమితులు ఉన్నాయని తమ అధికారం విశృంఖలమైనదీ.., ఎల్లలు లేనిదీ కాదని పాలకులకు ఇప్పుడిప్పుడే తెలిసి వస్తున్నది.

దీనికి ఒక కారణంగా సుప్రీంకోర్టు చేతిలో ఉన్న 'పాశు పతాస్త్రం' అన్నది కొందరి భావన.

ఆ 'పాశుపతాస్త్రం' పేరు పెగాసెస్. దేశంలోని తనకు 'కంటగింపు'గా ఉన్న నేతలు, జర్నలిస్టులు, జడ్జీలు, అధికారుల ఫోన్లను కేంద్ర ప్రభుత్వ పెద్దలు ట్రాక్ చేయడానికి ఇజ్రాయేల్ దేశానికి చెందిన గూఢచారి సాఫ్ట్‌వేర్ 'పెగాసెస్'ను వాడుకు న్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, సోషల్ మీడియా వ్యవస్థలు గగ్గోలుపెట్టాయి. 'మీరు ఈ సాఫ్ట్‌వేర్ కొన్నారా? లేదా? మా మీద ఉపయోగించారా? లేదా?' చెప్పాలని అంటూ ప్రతిపక్షాలు చేసిన ఆందోళనలతో... వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. అయినా సరే ప్రభుత్వ పెద్దలు నోరు మెదపలేదు. ఔను... కాదు అనలేదు. నీతి వాక్యాలకు మాత్రం లోటు లేకుండా చూసుకున్నారు.



మొండికేసిన కేంద్రంతో లాభం లేదనుకున్న జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు సుప్రీం కోర్టు తలుపు తట్టాయి. సుప్రీం కోర్టును ఒక్కటే ప్రశ్న అడిగారు, వీళ్ళు.

'పెగాసెస్'ను కొన్నారా... కొన లేదా అన్న విషయాన్ని కేంద్రంతో చెప్పించమని వీరు సుప్రీంను వేడు కున్నారు. చీఫ్‌జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్ విచారణ చేపట్టింది. ప్రతిపక్షాలకు దొరక్కుండా రెండు చేతులతోను దాచుకున్న కేంద్రం పిలక... ఇప్పుడు సుప్రీంకు దొరికినట్ట యింది. దీంతో కక్కలేక... మింగలేక... కేంద్రం గుటకలు మింగుతోంది. ఈ విషయంలో సుప్రీం చాలా కూల్‌గా... సంయమనంతో వ్యవహరిస్తూ... మిగిలిన అంశాలలో మాత్రం కేంద్రంపై విరుచుకుపడుతున్నది. 'పెగాసెస్' కంటే కూడా దేశంలో నిర్వీర్యమై ఉన్న వ్యవస్థలను తిరిగి క్రియాశీలకం చేయించడం అతి ముఖ్యం అని సుప్రీం కోర్టు భావిస్తున్నది. ఏ వ్యవస్థ పనిని అది చిత్తశుద్ధితో, అంకితభావంతో చేయడం ముఖ్యం. జస్టిస్ రమణ ఇప్పుడు ఆ పనిలోనే ఉన్నట్టు కన పడుతున్నది. జస్టిస్ రమణ 'ఆవేదన'ను సీబీఐ ఎంత త్వరగా అర్థం చేసుకునేటట్టు కేంద్రం చేస్తే, కేంద్రానికి అంతమంచిదనే భావన న్యాయవాద వర్గాలలో వ్యక్తమవుతున్నది. నిద్ర నటించడం ఇక కేంద్ర పెద్దలకు, సీబీఐకి కుదరకపోవచ్చు. కనీసం ఓ ఏడాది వరకు వీలుకాకపోవచ్చు.

ఈ ఏడాదిలోనే వ్యవస్థలను వీలైనంతగా క్షాళన చేయాలని దృఢచిత్తంతో పనిచేస్తున్న చీఫ్ జస్టిస్ రమణకు శుభాభినందనలు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com



# గూడూరు డివిజన్ వార్తలు

## స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేస్తా...

### చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ



గూడూరు పట్టణంలోని రాణిపేట ప్రాంతంలో ఇటీవల క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం జరిగింది. స్వచ్ఛాంధ్ర సంస్థ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా తొలి కార్యక్రమానికి పొనకా దేవసేనమ్మ హాజరయ్యారు. పరిశుభ్రత పాటించేందుకు తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా చేసి బుట్టల్లో ఉంచేందుకు అవసరమైన డస్ట్‌బిన్‌లను దేవసేనమ్మ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. ఒక్కొక్కరికి మూడు బుట్టలు వంతున అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చినందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఊహించని పదవి వరించిందని సంతోషం వ్యక్తం చేశారు. నా కల నెరవేరుతుందని పేర్కొంటూ గూడూరు అభివృద్ధికి మార్గం సుగమం అయ్యిందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కోసం తనవంతు కృషి చేస్తానని, ప్రజలు కూడా సహకరించా లన్నారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో దేవసేనమ్మ, శివకుమార్‌రెడ్డి దంపతులు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, మార్కెట్ ఏర్పాటుకు సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోమిడి శ్రీనివాసులు, నాగులు, బాలిబోయిన రమేష్‌గోపాల్ యాదవ్, కోదండరామయ్య, కోడిపర్తి శ్రీధర్, మురళి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## 53 జీఓను వెంటనే రద్దు చేయాలి

### ప్రైవేటు పాఠశాలల సంఘం డిమాండ్



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ.నెం.53ను వెంటనే రద్దు చేయాలని ప్రైవేటు పాఠశాలల సంఘం గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు బీ.శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 4వతేదీ గూడూరు మండల విద్యాశాఖ అధికారి సునీల్‌కి ఆ సంఘం సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విలయ తాండవంతో పాఠశాలలు సక్రమంగా నిర్వహించలేని దుస్థితి నెలకొందని, ఉపాధి కరువై చాలామంది తల్లిదండ్రులు సక్రమంగా ఫీజులు చెల్లించడం లేదన్నారు. దీంతో ఉపాధ్యాయులకు జీతాలు సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొందని, ప్రైవేటు పాఠశాలలను, అలాగే పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ.నెం.53ను రద్దు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యునైటెడ్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల బంద్‌ను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బీ.దశరథరామిరెడ్డి, కే.చంద్రమోహన్, శారద, వంశీకృష్ణ, పట్టణ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దేవసేనమ్మ జన్మదినాన నిరాశ్రయులకు 'మై ఫ్రెండ్స్' చేయూత



మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ జన్మ దినాన్ని పురస్కరించుకుని ఇటీవల వారి కుమారుడు దివ్యతేజరెడ్డి చేతుల మీదుగా గమల్లపాలెంలోని మెప్మా, మునిసిపాలిటీ నిర్వహి స్తున్న నిరాశ్రయుల వసతిగృహంలోని నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం, పండ్లు అందించారు. దివ్యతేజరెడ్డి మాట్లాడుతూ దేవసేనమ్మ మీద మై ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులకున్న ఆప్యాయ తను చూస్తుంటే సంతోషంగా ఉందని, పెద్దమ్మ పుట్టినరోజున పేదవారికి భోజనం అందించడం ఇంకా సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మై ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాహుల్, ఈద్గా అసోసియేషన్ హాషిం, ఇన్సాఫ్ కమిటీ సభ్యులు జమాల్, కబీర్, సభ్యులు నంద, కలీమ్, దావూద్, శ్రీవత్స, ప్రశాంత్, రమేష్, సందీప్, అశోక్, హరి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సరుకుల పంపిణీ



గూడూరు వీరభద్ర స్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ రెడ్ సంస్థ ఆధ్వ ర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగు లకు నిత్యావసర సరుకులను ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి పంపిణీ చేశారు. దివ్యాంగులైన మంజులకు రూ.1500, గోపికి రూ.1000 వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. అనిత, జీవనీరెడ్డి, జమునమ్మ, జానా సుధీర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఫీజులతో బడులు నడపలేం

## - ఆందోళన బాట పట్టిన ప్రైవేట్ యాజమాన్యాలు



ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో బడులు నడపలేమంటూ జిల్లాలోని అనేక ప్రైవేట్ స్కూళ్ళ యాజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి. అన్ని విధాలుగా అవస్థల పాలైన ప్రైవేట్ స్కూళ్ళ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ప్రభుత్వాన్ని కోరాయి. ఈనెల 4న జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల వారు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల ఫీజు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జిఓ నెంబరు 53,54లను వెంటనే రద్దు చేయాలంటూ పాఠశాలలు బంద్ చేసి పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఆందోళనల్లో పెద్దసంఖ్యలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు, నిర్వాహకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపు పదివేలకు పైగానే ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి పిల్లలకు కనీస ఫీజులు పెట్టి నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తమను కార్పొరేట్ పాఠశాలలతో కాకుండా ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా చూడాలని ఫెడరేషన్ ఆఫ్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు కోరారు. నెల్లూరులో పెద్దఎత్తున జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఎంవి సుబ్బారెడ్డి, శౌరిరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ స్కూళ్ళు మూతపడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్ళలో కరోనా ప్రభావంతో స్కూళ్లు నడపలేని పరిస్థితి ఏర్పడిందని, ఆర్థికంగా యాజమాన్యాలు బాగా చితికిపోయాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ స్కూళ్ళ మనుగడను కాపాడాలని కోరారు.

# ఆదూరమ్మ తల్లికి కావిళ్ళతో పొంగళ్ళు



చేజర్ల మండలం ఆదూరుపల్లి గ్రామదేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి ఆదూరమ్మ తల్లికి ఈనెల 5న పెద్దఎత్తున పూజలు జరిగాయి. ఆదూరుపల్లి గ్రామ శివారుల్లో కొలువైవున్న అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయప్రాంతమంతా కిటకిటలాడింది. తప్పెట్ల మోతలతో, బాణసంచా వేడుకలతో అమ్మవారి ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులంతా కావిళ్ళతో పొంగళ్ళ సామగ్రిని ఆలయం వద్దకు తెచ్చి, పొంగళ్ళు తయారుచేసి అమ్మవారికి సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

# ముమ్మరంగా 'సెబ్' దాడులు

## ఆర్టీసి బస్సుల్లో తరలిస్తున్న మద్యం, గంజాయి స్వాధీనం

జిల్లావ్యాప్తంగా సెబ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. అక్రమ రవాణాదారుల ఆట కట్టిస్తున్నారు. ముఖ్యంగా అక్రమ మద్యం, గంజాయి రవాణాలపై దృష్టి సారించి ఎక్కడికక్కడ వాటి రవాణాకు చెక్ పెడుతున్నారు. ఆర్టీసి బస్సుల్లో సాధారణ ప్రయాణీకుల్లా వెళ్తూ మద్యం, గంజాయిలను సైగ్గా తీసుకు వెళ్తున్న వారిని పట్టుకుని అరెస్ట్ చేస్తున్నారు. సెబ్ జేడి శ్రీలక్ష్మి ఆదేశాలతో ఈనెల 3,4 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జిల్లాలోని అనేకప్రాంతాల్లో పెద్దఎత్తున వాహన తనిఖీలు చేపట్టడంతో పలుచోట్ల మద్యం, గంజాయి పట్టుబడింది. దుత్తలూరులో తెలంగాణకు చెందిన ఆర్టీసి బస్సులో అక్రమంగా తరలిస్తున్న 148 క్వార్టర్ సీసాల గోవా మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వింజమూరు మండలం మోటిచింతలపాళెంకు చెందిన కె.సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా గౌరవరం టోల్‌ప్లాజా వద్ద చిత్తూరు వెళ్తున్న ఆర్టీసి బస్సులో 12కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని మదనపల్లికి చెందిన అహ్మద్‌బాషాను అదుపులోకి తీసుకుని కావలి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అదే టోల్‌ప్లాజా వద్ద కావలి సెబ్ అధికారులు తనిఖీలు చేసి విశాఖపట్టణం నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసి బస్సులో 75 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకుని తిరుపతికి చెందిన గోపి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. జిల్లా సెబ్ అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

# రామచిలుకలు కూడా దొరికాయి



రామచిలుకలతో పట్టుబడ్డ నిందితుడు. పక్కన సెబ్ సిబ్బంది

తడ మండలంలోని భీములవారిపాళెం చెక్‌పోస్ట్ వద్ద సెబ్ అధికారుల తనిఖీల్లో ఒక కారులో తరలిస్తున్న ఎనిమిది మేలుజాతి రామచిలుకలు దొరికాయి. వీటిని ఆస్ట్రేలియాకు చెందిన అరుదైన గ్రీన్‌వింగ్ మకావ్ పక్షులుగా భావిస్తున్నారు. వీటి ఖరీదు కూడా లక్షల్లోనే ఉంటుందట. రెండు బోనుల్లో ఉన్న ఈ పక్షులను గుర్తించి కారు డ్రైవర్‌ను, కారును, పక్షులను సూళ్ళూరుపేట వన్యప్రాణి విభాగం వారికి అప్పగించారు. సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్‌యువిఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది బి.వేణుగోపాల్, హరిబాబు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## సాయిబాబా సేవలో

# సినీగాయకుడు మనో



కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెం వద్ద ఉన్న 'దిన్నె' గ్రామంలో కొలువైవున్న శ్రీ షిరిడీసాయిబాబా మందిరాన్ని ప్రముఖ సినీగాయకుడు మనో (నాగూర్ బాబు)తో పాటు ఆయన కుటుంబసభ్యులు ఈనెల 4న దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మనో సాయినాథునిపై భక్తి గీతం ఆలపించి ఆలయ నిర్వాహకులకు మైక్‌సెట్‌ను బహుకరించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సాదరంగా స్వాగతించి శాలువతో సత్కరించారు.

# వేణుగోపాలునికి.. వేడుకగా పొన్నవాహన సేవ



నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామికి ఇటీవల ఆలయ అర్చకులు పొన్నవాహన సేవ నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని జరిగిన ఈ వేడుకలో తొలుత స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఆ తర్వాత పొన్నవాహనోత్సవం చేపట్టి వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహిచారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలమండలి ఛైర్మెన్, మేనేజింగ్ ట్రస్టీ మన్నెం లక్ష్మీనాథరెడ్డి, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డిల పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది.

# కోరిన వరాలిచ్చే కొండంత దేవుడు.. 'మహా గణపతి'

***విఘ్న వినాశకుడు, ఎంతటి కష్టాలనైనా తీర్చి..కోరిన కోరికలు నెరవేర్చి.. కోరుకున్న వరాలిచ్చే దేవుడు.. విఘ్నేశ్వరుడు. ఏ కార్యమైనా ఎలాంటి ఆటంకం లేకుండా నిర్విఘ్నంగా జరగాలంటే ముందుగా వినాయకుని ప్రార్థించడం అందరికీ తెలిసిందే. గణపయ్య అనుగ్రహం ఉంటే చాలు..ఎంతటి కష్టమైన పనులైనా సులభంగా, జయప్రదంగా జరిగిపోతాయి. సర్వసిద్ధి ప్రదాయకుడు..వినాయకుడే. అందుకే వాడవాడలా వినాయకునికి గుళ్ళు కట్టి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. అయితే, జిల్లాలో ఎన్నోచోట్ల వినాయకుని ఆలయాలున్నా, నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం ఎదురుగా భారీస్థాయిలో కొలువై ఉన్న 'మహా గణపతి' మందిరం మరెంతో విశిష్టమైనది. భక్తవరదుడు, సర్వశక్తి సమన్వితుడైన ఈ మహా గణపతి ప్రతిష్ట వెనుక ఆసక్తికరమైన కథనాలు కూడా ఉన్నాయి.***

అందరికీ ఎంతో ప్రీతిపాత్రమైన వినాయకునికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ముక్కోటి దేవతల్లో తొలి పూజలందుకునే దేవుడు..విఘ్నేశ్వరుడే. విద్యను, వివేకాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించే దైవం పార్వతీ తనయుడైన ఆ గణనాథుడే. అందుకే అందరి ఇళ్ళల్లోనూ గణపతి పూజ చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ప్రతి శుభకార్యంలో వినాయకుని పూజ ఉండి తీరాల్సిందే. ఇళ్ళలో ఉండే దేవుడి గదుల్లోనూ వినాయకునికి ప్రత్యేకస్థానం ఉంటుంది కూడా. అనేక దేవాలయాల్లోనూ వినాయకుని దర్శించుకున్న తర్వాతే ప్రధాన దేవతలకు పూజలు చేస్తుంటారు. వీధుల కూడళ్లలో, వీధుల మొదట్లో, చివరల్లో.. వినాయకుని గుళ్ళు, ప్రతిమలు ఏర్పాటుచేసి పూజలు చేస్తుంటారు. ఇక వినాయక చవితి పండుగ వస్తే చాలు..ఊరంతా సందడే. రకరకాల పత్రీపుష్పాలతో, అనేక రకాల పిండివంటల నైవేద్యాలతో పండుగ అంటే వినాయకచవితే అన్నట్లుగా ఉంటుంది.







మన దేవాలయాలు (64)

అంతటి విశిష్టమైన వినాయకునికి నెల్లూరులో మూలాపేట శివాలయం (మూలస్థానేశ్వరాలయం) ఎదురుగా ఒక భారీ గణపతిని ప్రతిష్ఠించి భక్తలోకానికి వినాయకుని పూజలకు కొదవలేకుండా చేశారు ఆలయ నిర్వాహకులు.

## 20 అడుగుల భారీ వినాయకుడు :



పురాతన కాలంలో నిర్మించిన భారీ గణపతి

నెల్లూరు నగరంలోని శ్రీ మూలస్థానేశ్వరుని ఆలయం ఎంతో పురాతనమైనది. ఇక్కడున్న శివలింగం స్వయంభువు. ఎప్పుడో ప్రాచీన కాలంలో ఇక్కడున్న నెల్లి చెట్టు (ఉసిరిక చెట్టు) కింద శివుడు ఉద్భవించాడు కనుకనే ఈ ఊరికి 'నెల్లి ఊరు' అని పేరొచ్చిందని, అదే ఆ తర్వాత 'నెల్లూరు'గా మారిందని కూడా అంటారు. అలా నెల్లూరుకే పేరు తెచ్చిన దేవాలయంగా మూలస్థానేశ్వరాలయం మరింత ప్రఖ్యాతిచెందింది. 14వ శతాబ్దంలో ఈ శివాలయం నిర్మించినట్లు చరిత్ర. చోళరాజులు, రెడ్డిరాజుల పాలనలో ఈ ఆలయం ఎంతో అభివృద్ధి చెందింది. శ్రీ భువనేశ్వరిదేవి అమ్మవారి మందిరం, మరోవైపు నవగ్రహ మండపం, నంది మండపంతో పాటు విశాలమైన ప్రాంగణంలో శ్రీ మూలస్థానేశ్వరుడు కొలువై ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఈ నేపథ్యంలో రాజుల కాలంలో ఈ భారీ గణపతిని నిర్మించారని అంటారు. కేవలం తెల్లసున్నం, బొంతరాళ్ళతో అద్వితీయంగా 'మహా గణపతి' విగ్రహమూర్తి నిర్మాణం పురాతన కాలం నాటి శిల్పుల శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక. ఆ తర్వాత కాలక్రమంలో శిథిలావస్తకు చేరుకోవడంతో సుమారు పాతికేళ్ళ క్రితం ఆలయ నిర్వాహకులు మధురై నుంచి శిల్పులను రప్పించి మూలమూర్తికి ఎలాంటి భంగం వాటిల్లకుండా, విగ్రహాన్ని ఉన్నదున్నట్లుగానే ఉంచి సిమెంటుతో పునరుద్ధరించారు. మద్రాసు నుంచి వేద పండితులను పిలిపించి మహా గణపతి హోమం తదితర విశిష్ట పూజలు నిర్వహించి ఎంతో వైభవంగా పున:ప్రతిష్ట చేయించారు. 20 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పు ఉన్న ఈ భారీ 'మహా గణపతి' మందిరం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటుంది. 'ఓం..శ్రీ మహా గణాధిపతియే నమ:' అని ధ్యానించుకుంటూ ఆ మహా గణపతిని భక్తితో పూజిస్తే చాలు.. ఆ స్వామి అనుగ్రహం తప్పకుండా కలుగుతుంది.

### సమస్యలు తీర్చాలంటూ..

# తపాలా ఉద్యోగుల ఆందోళన



పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ తపాలా ఉద్యోగులు ఈనెల 7న ఎన్ఎఫ్‌పిఇ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు ఏవి కృష్ణయ్య డిమాండ్ చేశారు. నెల్లూరులోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు చేపట్టిన ధర్నాందోళనలో ఆయన మాట్లాడుతూ 18 నెలలుగా ఆగిన కరువు భత్యం బకాయిలను వెంటనే అందజేయాలని, కరోనాతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల నగదును అందజేసి ఆదుకోవాలని, జిడిఎస్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచన విరమించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పిఇ నాయకులు హరి, రత్నం, పెంచలయ్య, హరికృష్ణ, సుబ్బారావు, నరసింహులు, రాఘవయ్య, శ్రీనివాసులు, నాగభూషణం, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

# నవంబరులో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మహాసభ

### —యూనియన్ గౌరవాధ్యక్షులు సింహపురి బాబు

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం(ఏపీజేఎఫ్) రాష్ట్ర మహాసభ నెల్లూరు నగరంలో నవంబరు నెలలో నిర్వహించాలని నిర్ణయించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆకుల పురుషోత్తం బాబు (సింహపురి బాబు) పేర్కొన్నారు. సభ విధివిధానాలపై నెల్లూరులో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులకు సంతాపం తెలిపారు. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా నవంబర్‌లో మహాసభ నిర్వహించనున్నట్లు బాబు తెలిపారు.

# 11న విలువిద్య క్రీడాకారుల ఎంపిక

ఈనెల 16నుంచి 18 వరకు విజయవాడలో జరగనున్న ఆర్చరీ (విలువిద్య) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఈనెల 11న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపికచేయనున్నామని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణు తెలిపారు. వివరాలకు 94419 55334 నెంబరును సంప్రదించాలని కోరారు.

# దెబ్బ మీద దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కాలం అయిపోతుంది. తాను చెప్పినవి చెప్పనివి ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నారు జగన్. ఎక్కడా కొంచం కూడా తగ్గడంలేదు. తాను చెప్పిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి ఒక్క అడుగు కూడా. వెనకకు తగ్గడంలేదు. ఆర్థిక నిపుణులకు సైతం అంతు చిక్కని తరహాలో వివిధ పథకాల పేరుతో రాష్ట్ర ఖాజానా నుండి లక్షల కోట్ల డబ్బులు ప్రజల ఖాతాలలో నేరుగా జమచేస్తున్నారు. చివరకి ప్రజలకి కుచ్చు టోపీ పెట్టిన అగ్రిగోల్డ్ బాధితులను కూడా ఆయన ప్రభుత్వ డబ్బులతోనే ఆదుకున్నారు. ఇన్ని కార్యక్రమాలు చేపడుతున్నా, ప్రజలకోసం తాను ఇంత చేస్తున్నా న్యాయస్థానాలలో మాత్రం ఆయనకు అన్నీ చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. ఇరవై ఎనిమిది నెలల కాలంలో వందల సంఖ్యలో ఆయన ప్రభుత్వంపై కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా అంతే స్థాయిలో తీర్పులు వెలువడుతున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పోలీస్ బాస్ డిజిపిలు కూడా బోనులో నిలబడవలసిన పరిస్థితి వచ్చింది. ఇటీవల ముగ్గురు ఐఏఎస్ అధికారులకు కూడా కోర్టు శిక్ష వేసింది. అమ్మఒడి, వసతి దీవెన వంటి పథకాల విషయంలో కూడా కోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగానే తీర్పు ఇచ్చింది. తాజాగా ఉపాధి హామీపథకానికి సంబంధించిన బిల్లులు చెల్లింపులపై కూడా కోర్టు ప్రభుత్వానికి చివాట్లు వేసింది. సెప్టెంబర్15 లోగా చెల్లించాలని ఆదేశించింది. లేదంటే కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవలసి వస్తుందని ఆదేశించింది. నిన్నటికి నిన్న వినాయక చవితి ఉత్సవాల విషయంలోకూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది.

### ఎవరిదీ లోపం...

ముఖ్యమంత్రి చుట్టూ చేరి చెక్క భజన చేస్తున్న అగ్ర నాయకులు, ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను జగన్ దృష్టికి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఇన్ని కేసులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నా అవసరమైన చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మనం ఇస్తున్న డబ్బులు, అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు మనకు హారతులు పడుతున్నారని చెప్పి ముఖ్యమంత్రిని మునగచెట్టు ఎక్కిస్తున్నారు తప్ప న్యాయస్థానాలలో అయన పరువును కాపాడలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో నమోదవుతున్న కేసులను సమర్థవంతంగా ఎదుర్కోలేక చతికిలపడుతున్నారన్న మాట సర్వత్రా వినపడుతోంది. ఇప్పటికైనా సమర్థవంతమైన న్యాయ సలహాదారులను ప్రభుత్వం నియమించుకుని, ప్రభుత్వంపై పడుతున్న మరకను కడుక్కోకపోతే, న్యాయస్థానాల్లో అత్యధిక కేసులలో ఓడిపోయిన ప్రభుత్వంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రకెక్కే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కళ్యాణ వైభవం...!



## కనుల పండుగగా కొండా వారి కళ్యాణం

నెల్లూరు వాస్తవ్యులు, ప్రస్తుతం బెంగుళూరులో స్థిరపడిన కొండా రవీంద్ర చంద్రారెడ్డి – మాధవిల రెండవ కుమార్తె (కీ॥శే॥ కొండా రామచంద్రారెడ్డి – కీ॥శే॥ కొండా సుజాతమ్మల మనుమరాలు)

**సుజిత – విహాన్‌రెడ్డి**

(మారెడ్డి కృష్ణారెడ్డి – రుక్మిణిల కుమారుడు)ల కళ్యాణ వైభవం సెప్టెంబర్ 1వ తేదీ హైదరాబాదులో జరిగింది. వియ్యంకులిద్దరూ మంచి సామాజిక సంబంధాలు కలిగిన వారు కావడంతో నెల్లూరు, బెంగుళూరు, హైదరాబాదు, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన పలు రంగాల ప్రముఖులు ఈ శుభవేడుకలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



# కంటతడి పెడుతున్న కాంట్రాక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ పనులు చేయడం సాహసోపేత నిర్ణయమే అన్నది వారి అభిప్రాయం.

### ఏఐఐబి పనులకూ బ్రేక్...

ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్లిమెంటేషన్ బ్యాంకు (AIIB) సహకారంతో గత ప్రభుత్వంలో కోట్ల రూపాయల పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇటీవల వరకూ పాత బిల్లులు చెల్లించలేదు. ప్రభుత్వం 30 శాతం ఇస్తే బ్యాంకు 70 శాతం నిధులను మంజూరు చేస్తుంది. కేవలం 30 శాతం ప్రభుత్వం తరపున చెల్లించి అలాంటి స్కీములను కూడా ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోవడం బాధాకరమని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

### పియంజియస్‌వై...

ప్రధాన మంత్రి గ్రామీణసడక్ యోజన (PMGSY) పథకంలో కూడా ప్రభుత్వం 30శాతం భాగస్వామ్యంతో పనులు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం 30శాతం నిధులతో ప్రతిపాదనలు పంపిస్తే కేంద్రప్రభుత్వం 70 శాతం మ్యాచింగ్ గ్రాంట్ మంజూరు చేస్తుంది. ఏఐఐబి, పియంజియస్‌వై పథకాల ద్వారా గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసుకోవచ్చు. ప్రభుత్వం ప్రజల అకౌంట్లలో వేసే డబ్బులో నుండి 30 శాతం ఈ పథకాల కోసం ఖర్చు చేసినా ఇటు ప్రభుత్వం అటు కాంట్రాక్టర్లు ఇద్దరూ లబ్ది పొందుతారన్నది వారి ఆలోచన. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(NDB) జిల్లా ప్రధాన రహదారులను బాగుచేసే ప్రయత్నం జరిగినప్పటికీ, కాంట్రాక్టర్లు ధైర్యం చేసి ముందుకు రాకపోవడంతో, అవి కూడా అరాకొరగానే జరిగాయని చెప్తున్నారు.

### 1000 నుండి 2000 కోట్లతో కొత్త పనులు...

ఇటీవల ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర రోడ్లపై దృష్టి పెట్టారు. వెంటనే టెండర్లు పిలిచి రాష్ట్రమంతా రోడ్లను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడే అందరికీ సంకోచం, సంశయం, సందిగ్ధం ఉన్నాయి. పనులు చేస్తాం... మరి డబ్బులో....? ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తామని సిఎం చెప్తున్నప్పటికీ వీళ్ళు సాహసించలేకపోతున్నారు. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నాలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం. కాంట్రాక్టర్లతో మంత్రులూ, ఎమ్మెల్యేలూ అధికారులూ మాట్లాడి వాళ్ళకు స్పష్టమైన హామీ ఇచ్చి పనులు మొదలు పెట్టించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని చెప్తున్నారు.

పాత బిల్లులు చెల్లించకుండా కొత్త పనులను చేయించుకునే ప్రయత్నం ఇప్పుడు జరుగుతుందంటున్నారు. గతంలో చేసిన పనుల తాలూకా బిల్లులు రానందువల్ల వడ్డీలు పాపం పెరిగినట్లు పెరిగి కాంట్రాక్టర్లు ఇప్పటికే కంట నీరు పెట్టుకుంటున్నారు. మళ్ళీ కల్లబొల్లి మాటలు చెప్పి కొత్త పనులు అప్పచెప్పాలని చూస్తే... లొంగే ప్రసక్తే లేదని కూడా అంటున్నారు. ఇప్పటికన్నా ప్రభుత్వం కళ్ళు తెరచి కాంట్రాక్టర్లను ఆదుకుని నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వకపోతే, వ్యవస్థ నిర్వీర్యమైపోతుందని చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. రాబోయే రోజుల్లో ఆంధ్ర కాంట్రాక్టర్లంతా దరూ పక్క రాష్ట్రాల్లో పనులు వెతుక్కుని వెళ్ళిపోతారని అంటున్నారు.

# ఉపాధ్యాయులను సన్మానించిన 'ప్రజా వాకర్స్'



గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న నెల్లూరులోని జడ్పీ హై స్కూల్‌లో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు గొర్ల పెంచలయ్య, సిఆర్ రాఘవ, సింధు, డి. అరుణ, జయప్రకాష్‌నారాయణ, ఎంవి కృష్ణయ్య, కటకం కోటేశ్వరరావు, ఏ.నరసింహులు, అల్లూరు రాజు, ఎన్.చంద్రశేఖర్, జివి సుబ్బారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, టివి రమణమూర్తి, ఎస్.వెంకటేశ్వర్లురెడ్డి, పి.బాలసుబ్రహ్మణ్యంలు ఈ సన్మానాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాల ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, షరాబు సత్యనారాయణ, జడ్పీ వాకర్స్ గౌరవాధ్యక్షులు తుంగా నారాయణరెడ్డి, అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మెట్టు సుధాకర్‌రెడ్డిలతో పాటు ఉమ్మిడిశెట్టి చెంచయ్య, వాకర్స్ మహిళలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు తీర్చాలి




రాష్ట్రంలోఉన్న రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, లైబ్రరీ అసిస్టెంట్‌లకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కోరారు. ఈనెల 5న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు, సిపిఎస్ రద్దు, పెండింగ్ సమస్యలు అన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఆ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డితో పాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మోహన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, బి.వి రమేష్‌బాబు, సురేష్‌బాబు, శ్రీధర్ దీక్షితులతో పాటు జిల్లాలోని రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

## జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి



సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని డిపిఓ (జిల్లా పంచాయతి అధికారి) ధనలక్ష్మి అన్నారు. ఈనెల 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అయిదుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావుకు, ఇప్పగుంట మల్లికార్జునరావుకు ఈ సందర్భంగా 'గురుప్రపూర్ణ' అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ మాట్లాడుతూ ప్రతిఏటా ఈ ట్రస్ట్ వారు గురుపూజోత్సవాలు నిర్వహించి ఉపాధ్యాయులకు సన్మానాలు చేస్తుండడాన్ని అభినందించారు. నెల్లూరు ఆర్టీఓ హుస్సేన్‌సాహెబ్, ఏపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్, ట్రస్ట్ ఛైర్మెన్ సర్వేపల్లి రామమూర్తి, వైస్ ఛైర్మెన్ సర్వేపల్లి చంద్ర, ప్రధాన కార్యదర్శి సర్వేపల్లి శివకుమార్, తలుపూరు శ్రీరామమూర్తిలతో పాటు రిటైర్డ్ తహశీల్దార్ డివి సుధాకర్, హెడ్మాస్టర్ పల్లం వేణుగోపాల్, పెరసం ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి రాష్ట్రనేతగా నెల్లూరీయుడు

## ఏకగ్రీవంగా సుదర్శన చక్రధారి నియామకం

రాష్ట్ర పద్మశాలి సంఘానికి కొత్త అధ్యక్షుడిని నియమించాలనే విషయం ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ఆ సంఘానికి అధ్యక్షునిగా నెల్లూరుజిల్లాకు చెందిన కె.సుదర్శన చక్రధారిని ఏకగ్రీవంగా అందరి ఆమోదంతో నియమించారు. ఇప్పటిదాకా ఉన్న అధ్యక్షుడు వయోభారంతో పాటు అనారోగ్యంతో ఉండడంతో స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానంలో సుదర్శన చక్రధారి నియమితులయ్యారు. ఈనెల 6న ఏలూరులో జరిగిన రాష్ట్ర పద్మశాలి సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



## పెంచలకోన ఆలయానికి..

# 12 మందితో కొత్త కమిటీ

జిల్లాలోని రాపూరు మండలంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయానికి కొత్త ధర్మకర్తల మండలి నియామకం ఖరారైంది. పాలకవర్గం సభ్యులుగా చెన్ను తిరుపాల్‌రెడ్డి (తానం చెర్ల), కరిపోగు సుబ్బమ్మ (దాచూరు), వడ్లపల్లి పెంచలయ్య (గోనుపల్లి), చల్లా లక్ష్మీప్రసన్న (కలువాయి), యాకసిరి అంకయ్య (ఓబులాయపల్లి), మోడికొండ అనిల్‌కుమార్ (తురిమెర్ల), ముప్పాళ్ళ సునీత (చాగణం రాజుపాళెం), కండే రమణయ్య (బిరదవోలు), మోదేపల్లి ఇందిర (చిత్తలూరు), గాలం రత్నమ్మ (ఉయ్యాలపల్లి), గుండు విజయకుమార్‌రెడ్డి (కడపజిల్లా)లను సభ్యులుగా, ఆలయ ప్రధాన అర్చకుడు రామయ్యస్వామిని ఎక్స్ అఫిషియో సభ్యునిగా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 7న ఉత్తర్వులు జారీచేసింది. సభ్యులంతా కలసి ఛైర్మెన్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఈ కొత్త కమిటీ త్వరలోనే ప్రమాణ స్వీకారం చేస్తుందని భావిస్తున్నారు.

# జిల్లావ్యాప్తంగా 13న ధర్నాలు

## ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

'ఆశా' వర్కర్లు ఎంతోకాలం నుంచి సమస్యల సుడిగుండంలో ఉన్నారని, వారి ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 13న జిల్లావ్యాప్తంగా పిహెచ్‌సిల వద్ద ధర్నాందోళనలు నిర్వహిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను క్రమబద్ధీకరించడంతోపాటు, ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న వారి సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మితో పాటు సుభాషిణి, అరుణ, మేరీ మంజుల, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# లేనిపోని అపోహలు వద్దు

## అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ ఇవ్వాలి

### - అధికారులను ఆదేశించిన డిఆర్‌డిఏ పి.డి. జడ్పీ సిఇఓ



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ పథకంలో లేనిపోని అపోహలు వద్దని, పెన్షన్లు రద్దు చేస్తున్నారనే అనుమానాలు పెట్టుకోవద్దని ప్రజలందరికీ తెలియజేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ) ప్రాజెక్టు డైరెక్టర్ కెవి సాంబశివారెడ్డి, జడ్పీ సిఇఓ సుశీల సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల 7న వారు నెల్లూరులోని డిఆర్‌డిఏ, జడ్పీ కార్యాలయాల నుండి మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛను అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరికీ పింఛను రద్దుకాకుండా చూడాలని ఆదేశించారు. ఈ నెలలో వివిధ కారణాల వల్ల జిల్లాలో 9300 మంది పింఛన్లు తీసుకోలేకపోయారని తెలుస్తోందని, వారిలో ప్రతిఒక్కరినీ పరిశీలించి తమకు నివేదిక పంపాలని, హౌస్ హోల్డ్ సర్వే మ్యాపింగ్, ఇకెవైసి తదితరాల వల్ల పింఛను అందుకో లేకపోయిన అర్హులకు పెన్షన్లు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసు కోవాలని వారు ఆదేశించారు.

# జీతాలు పెంచి ఆదుకోండి

## పారిశుద్ధ్య కార్మికుల అభ్యర్థన

ఎంతోకాలంగా తాము తక్కువ వేతనాలతోనే జీవిస్తున్నామని, ఇటీవలి కాలంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోవడంతో జీవనం గడవడానికి ఇబ్బందిగా ఉందని, నెలసరి వేతనాలను 6వేల నుంచి కనీసం రూ.10వేలకు పెంచి తమను, తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ కలిగిరి పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులు అభ్యర్థిస్తున్నారు. ఈనెల 6న వారు కలిగిరి ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం, ఇఓఆర్డీ సురేష్‌లకు వినతిపత్రం అందజేశారు. పంచాయతిరాజ్ జిఓ నెం.680 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీసం 10వేలు వేతనాలుగా ఇవ్వాలని ఉందని, అయినా చాలా కాలంగా తమ జీతాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్టుగా తయారైందని, ప్రభుత్వం సహృదయంతో పరిశీలించి వెంటనే తమ జీతాలు పెంచాలని వారు కోరారు.

# జిల్లాలో పదవుల పండుగ

అనేకమందికి కార్పొరేషన్ డైరెక్టర్ల పదవులు రావడంతో జిల్లాకు పదవుల పండుగ వచ్చినట్లయింది. కొత్తగా పలు కార్పొరేషన్‌లకు డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేయడంతో ఎంతోకాలంగా ఎదురుచూసిన పదవులు రానేవచ్చాయనే సంతోషం పదవులు దక్కించుకున్న వారిలో తొణికిసలాడుతోంది. ఇటీవలే రాష్ట్రస్థాయిలో ఆరుగురికి కార్పొరేషన్ ఛైర్మెన్ పదవులు లభించిన నేపథ్యంలో, ఇప్పుడు వచ్చిన డైరెక్టర్ల పదవులతో అధికార పార్టీలో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి. ఈనెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాకు 21 డైరెక్టర్ పదవులు ఇచ్చి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఇచ్చిన మాట ప్రకారం సిఎం అన్ని వర్గాల వారికి, ప్రధానంగా మహిళలకు సముచిత ప్రాధాన్యతను కల్పించడంతో మహిళాలోకంలో కూడా ఆనందం వ్యక్తమవుతోంది. పురుషులకు 9పదవులు ఇస్తే, మహిళలకు 12 పదవులను కేటాయించి పదవుల పందారంలో మహిళలకు మంచి స్థానం ఇచ్చారు.

## కొత్త డైరెక్టర్లు వీరే :

కొత్తగా కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు పొందిన వారిలో ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన సిహెచ్ మంజూష (బీసీ) రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని పొందారు. అదేవిధంగా కలువ నరసింహులు(ఎస్సీ) ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్‌గా, గూడూరు నియోజకవర్గానికి చెందిన యారం మంజుల (బీసీ) ఏపి నాటక అకాడమీ డైరెక్టర్‌గా, కొండారెడ్డి సౌజన్య(ఓసీ) ఏపి గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవులు అందుకున్నారు. కావలి నియోజకవర్గానికి చెందిన పాలేపల్లి అనిల్‌రెడ్డి(ఓసీ) ఏపి స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరయ్యారు. షేక్ షమీనా (మైనార్టీ) నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. కోవూరు నియోజకవర్గంలో నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి (ఓసీ) ఏపి రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కాగా, పూండ్ల మాధవి (ఓసీ) ఏపి ఉమెన్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని పొందారు. నాపా వెంకటేశ్వర్లు నాయుడు(ఓసీ) ఏపి అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవినందుకున్నారు. నెల్లూరు నియోజకవర్గంలో కొణిదల మునివెంకట సుధీర్(ఓసీ) ఏపి స్టేట్ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని పొందారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎస్‌కె కరిముల్లాకు రాష్ట్ర ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, టి.మమతారెడ్డి(ఓసీ)కి ఏపి స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవులు లభించాయి. సర్వేపల్లి నియోజవర్గానికి చెందిన నలగర్ల భారతి (ఓసీ) ఏపి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, దాసరి భాస్కరగౌడ్ (బీసీ) నెడ్‌క్యాప్ న్యూ రెన్యువల్ ఎనర్జీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, సూళ్ళూరుపేట నియోజకవర్గానికి చెందిన కట్టా సురేష్ (ఓసీ) ఏపి రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, కళత్తూరు శేఖర్‌రెడ్డి (ఓసీ) నాటక అకాడమీ డైరెక్టర్‌గా, కోటంబేటి భారతి (ఎస్సీ) సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవులు పొందారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అక్కి భాస్కర్‌రెడ్డి (ఓసీ) సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా, బత్తా వెంకట ఝాన్సీలక్ష్మి (ఎస్టీ) ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, వెంకటగిరి నియోజకవర్గంలోని ఆవుల సుకన్య (బీసీ) ఏపిఐఐసి డైరెక్టర్‌గా, కె. వేదప్రియ (ఓసీ) ఏపి హ్యాండ్‌క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

# టీకాయే రక్షణ కవచం

- కరోనా నిరోధానికి పంచసూత్రాలు ప్రకటించిన ఉప రాష్ట్రపతి
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో 3 కేంద్రాల్లో టీకాలు
- 'టీకా' కార్యక్రమాన్ని..ప్రజా ఉద్యమంగా చేపట్టాలని పిలుపు



*కరోనా మహమ్మారి వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 7న ఎంతో స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. కరోనా నివారణకు పంచసూత్రాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా టీకా కార్యక్రమాన్ని ప్రజాఉద్యమంగా చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ మానవాళిపై కరోనా చూపించిన ప్రతికూల ప్రభావాన్ని వందేళ్లలో మనం ఎన్నడూ చూడలేదని, అసాధారణ రీతిలో వచ్చిన ఈ సంక్షోభాన్ని అసాధారణ రీతిలోనే ఎదుర్కోవాలని, ఇందులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.*

కరోనా వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ భారత ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు తనదైన శైలిలో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేసిన ప్రసంగం అందరినీ ఉత్తేజితుల్ని చేసింది. రంగారెడ్డిజిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టీకా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, నెల్లూరులలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్టు కేంద్రాల్లో ఒకే సమయంలో ఉచిత టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ స్వర్ణభారత్ ట్రస్టు నుంచి వర్చువల్ పద్ధతిలో ఈ కేంద్రాలను ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆయన సతీమణి శ్రీమతి ఉషమ్మ ప్రారంభించి అందరికీ స్ఫూర్తిని కలిగించారు. ఈ కేంద్రాలన్నిటిలో కలిపి 5 వేల మందికి టీకాలు వేశారు. కోవిడ్ బారిన పడకుండా రక్షణ పొందాలంటే కోవిడ్ టీకా ఒక్కటే మార్గమని, అందరూ తప్పనిసరిగా ఈ ఉచిత టీకా వేయించుకోవాలని వారు కోరారు.

## వెంకటాచలంలో :

గ్రామీణ ప్రజలకు సేవలందించేందుకు స్థాపించిన నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ఆవరణంలో స్వర్ణభారత్ ట్రస్టు 20వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత కోవిడ్ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్దన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి మాజీ సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముప్పవరపు హర్షవర్ధన్, సింహపురి వైద్యసేవాసమితి నిర్వాహకులు నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి జాయింట్ కలెక్టర్లు హరీంద్రప్రసాద్, గణేష్‌కుమార్, స్వర్ణభారత్ ట్రస్టు సిఇఓ శరత్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గన్నవరంలో :

అదేవిధంగా గన్నవరం కేంద్రం నుంచి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యదర్శి చుక్కపల్లి ప్రసాద్, ట్రస్టీ గ్రంధి విశ్వనాధ్ పాల్గొన్నారు. భారత్ బయోటెక్ కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మెన్ కామినేని శ్రీనివాస్, హైదరాబాద్ శాఖ కార్యదర్శి సుబ్బారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ ఛైర్మెన్ భద్రారెడ్డి, ట్రిపుల్ ఒలింపియన్ ఎన్ ముకేష్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని మెడిసిటీ ఆసుపత్రి, నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి, విజయవాడలోని సిద్ధార్థ వైద్యకళాశాల ప్రతినిధులు, అనేకమంది వైద్యులు, వైద్యసిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొని కోవిడ్ పట్ల ప్రజలను అప్రమత్తం చేశారు.





## కోవిడ్ టీకాపై అపోహలు వద్దు - ఉప రాష్ట్రపతి

ఈ కార్యక్రమాల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కోవిడ్ టీకా పట్ల ఎవరికీ ఎలాంటి అపోహలు ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. టీకా రక్షణ కవచమన్నారు. టీకా వేసుకున్న తర్వాత కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనన్నారు. ప్రజాప్రతినిధులు, కళాకారులు, క్రీడాకారులు ఇలా అన్ని రంగాల్లోని వారు టీకా విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహల్ని పోగొట్టేందుకు, టీకా ప్రక్రియ సక్రమంగా సాగేందుకు చొరవ తీసుకోవాలన్నారు. పత్రికలు కూడా ఈ విషయంలో తమవంతు పాత్రను సమర్ధ వంతంగా పోషించాలన్నారు. కరోనాపై సాగుతున్న పోరాటంలో కేంద్రప్రభుత్వం ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని చేపడుతోందని, దీనిని ప్రజా ఉద్యమంగా మార్చి విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టునెలలో దేశంలో 50 శాతం మంది భారతీయులకు టీకాలు వేయడం పూర్తయిందని, టీకా వేయడంలో మనదేశం సాధించిన విజయాల్లో ఇదొకటి అని ఆయన అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఈ కరోనా కష్టకాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో ఆత్మ నిర్భరత్‌ను చాటుకుంటూ భారత్ ముందుకు సాగుతోందని, టీకా తయారీతో పాటు ఉచితంగా ప్రజలకు టీకాలు అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తోందని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వసుధైక కుటుంబం విధానం స్ఫూర్తితో విదేశాలకు సైతం మన టీకాలు పంపిణీ చేస్తున్నామని, సమిష్టి కృషితో కరోనాపై చేస్తున్న పోరాటంలో మనం ముందంజలో ఉన్నామని, ఇకపై కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కోవిడ్ నివారణకు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా అయిదు సూత్రాలను ప్రకటించారు. వ్యక్తిగత శుభ్రతను పాటించడం, మాస్కులు ధరించడం, సురక్షిత దూరం పాటించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై దృష్టిపెట్టడం, ప్రకృతితో మమేకమై జీవించడం, ప్రభుత్వాలు, నిపుణులు సూచించిన విధంగా కోవిడ్ నిబంధనలు అనుసరించడం ఎంతో ముఖ్యమని ఆయన వివరించారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com